శ్రీ బాల గాయత్రి బ్రాహ్మణ వధూవరుల
సమాచార కేంద్రము, విజయవాడ.
ఆర్గనైజర్: యమ్. ఎన్. వి. సూర్యనారాయణ మూర్తి,
23-36/1-16, అయ్యప్పటవర్స్, GF-1 మెయిన్‌రోడ్డు, శ్రీనగర్,
సత్యనారాయణపురం, విజయవాడ.
ప్రతి ఆదివారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు
మధ్యాహ్నం 3 నుండి సాయంత్రం 5 గంటల వరకు
వధూవరుల సమాచారము కొరకు సంప్రదించగలరు.
98490 15042

VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM
Postal License No. VSP / 96/ 2021 - 23
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్

మీకు ఆస్థి ఉండి
తగినంత రుణ సదుపాయం
పొందలేక పోతున్నారా?
ఉచిత సలహాలకై మమ్మల్ని
సంప్రదించండి
6303988189

RNI No.52722/90 సంపుటి : 32 సంచిక : 249 విశాఖపట్నం, 22 జూలై 2022 శుక్రవారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00
Circulated at Visakhapatnam, Hyderabad, Vijayawada, Guntur, Tirupati, East Godavari, West Godavari, Kadapa, Nellore, Srikakulam, Vizianagaram, Yanam, Bhubaneswar, Raipur

## భారత 15వ రాష్ట్రపతిగా ద్రౌపది ముర్ము

### 25న ప్రమాణ స్వీకారం



*న్యూఢిల్లీ: రాష్ట్రపతి ఎన్నికల్లో విజయం సాధించి భారతదేశ అత్యున్నత రాజ్యాంగ పదవిని అలంకరించనున్న తొలి గిరిజన మహిళగా ఎన్డీఎకు చెందిన ద్రౌపది ముర్ము గురువారం చరిత్ర సృష్టించారు. ప్రతిపక్షాల అభ్యర్థి యశ్వంత్ సిన్హాపై ముర్ము 50 శాతం మార్కును అధిగమించారు.*

*2015-2021 మధ్య జార్ఖండ్ గవర్నర్‌గా కూడా పనిచేసిన ద్రౌపది ముర్ము.. రామ్ నాథ్ కోవింద్ తర్వాత భారతదేశ 15వ రాష్ట్రపతి అవుతారు. కోవింద్ పదవీకాలం జులై 24తో ముగియనుంది, కొత్త రాష్ట్రపతి జూలై 25న ప్రమాణ స్వీకారం చేయనున్నారు.*

## పథకాలలో ఏపీ దేశానికే తలమానికం

**తాడేపల్లి:** సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశానికి ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం చేయని విధంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు.

నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకే లక్షా 65 వేల కోట్లు జమ చేశామని సీఎం జగన్ అన్నారు. "పాలనలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చాం. దేశంలో పలు రాష్ట్రాలకు మన పాలన ఆదర్శంగా ఉంది. అమ్మ ఒడి ఇచ్చిన రాష్ట్రం ఎక్కడా లేదు. ఆరోగ్యశ్రీలో 3 వేల చికిత్సలు ఇస్తున్న ప్రభుత్వం మనదే. అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి లోతుగా తీసుకెళ్లాలి. లబ్ధిపొందుతున్న వారికి మరోసారి తెలియజెప్పాలని" సీఎం జగన్ సూచించారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాల(ఎస్‌డీజీ) సాధనకు ఎప్పుడూ కూడా ఇంతగా ప్రయత్నాలు చేయలేదు. ఎస్‌డీజీకు సంబంధించి మనం ఇంత బాగా చేస్తున్నా కూడా, సమర్థవంతమైన రిపోర్టింగ్ కూడా అవసరం. రిపోర్టింగ్ మానిటరింగ్ అనేది సక్రమంగా జరగనప్పుడు ఎంత బాగా పనిచేసినా లాభం లేదు. ఇప్పుడు జాతీయ స్థాయిలో పోటీపడ్డం ద్వారా...దేశంలో తొలి స్థానంలో నిలబడ్డానికి అవకాశం వచ్చింది. గతంలో ఈ పరిస్థితి లేదు, మరేరాష్ట్రంలో ఇన్ని పథకాలు లేవు.



**తొలిసారిగా మనం చేస్తున్నాం**

క్యాలెండర్ ప్రకారం మిస్ కాకుండా.. ఏ పథకం ఎప్పుడు వస్తుందనేది ముందుగానే క్యాలెండర్ ప్రకటిస్తున్నాం

డీబీటీ ద్వారా బటన్ నొక్కిన వెంటనే నేరుగా లబ్ధిదారుడి ఖాతాలోకే డబ్బులు పోతున్నాయి

అవినీతి, వివక్షకు తావు లేకుండా శాచ్యురేషన్ మోడ్‌లో ఈ పథకాలు.. అందిస్తున్నాం

జిల్లాల్లో కలెక్టర్లు ఎస్‌డీజీ రిపోర్టును మానిటరింగ్ చేసే బాధ్యత తీసుకోవాలి

విభాగాధిపతుల పర్యవేక్షణ అవసరం. ఇది నిరంతరం జరగాల్సిన ప్రక్రియ. ప్రతి నెలా ఎస్‌డీజీ రిపోర్టును కలెక్టర్ పర్యవేక్షణ చేయాలి. సచివాలయం నుంచి డేటా జిల్లా స్థాయికి చేరాలి. వైద్య, ఆరోగ్యం, విద్య, వ్యవసాయ రంగాల్లో మనం తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులు, అభివృద్ధి కార్యక్రమాలు దేశంలో మరే రాష్ట్రంలోనూ లేవు.

ఎంఎస్ఎంఈ రంగంలోనూ మనం చేస్తున్న కృషి మరే రాష్ట్రంలోనూ లేదు. ప్రతి సంవత్సరం మనం క్యాలెండర్‌ఇచ్చి బటన్ నొక్కి ఎంఎస్ఎంఈలకు టైం ప్రకారం ఇన్సెంటివ్‌లు ఇస్తున్నాం. దేశంలో ఎక్కడా ఇలా జరగడం లేదు.. రాష్ట్రంలో కూడా ఇది జరగలేదు. గత ప్రభుత్వ ఇన్సెంటివ్‌లకు సంబంధించిన బకాయిలు కూడా మనమే చెల్లించాం.

ప్రతిరంగంలోనూ ప్రస్ఫుటమైన మార్క్ వేయగల పథకాలు మన రాష్ట్రంలో ఉన్నాయి. అమ్మ ఒడి, టీఎంఎఫ్, ఎస్ఎంఎఫ్‌లను సక్రమంగా రిపోర్టింగ్ చేయలేదు. సంపూర్ణ పోషణ, గోరుముద్ద కూడా సక్రమంగా రిపోర్టింగ్ చేయలేదు. విద్యాకానుక, విద్యా దీవెన, పుల్ ఫీజు రీయింబర్స్‌మెంట్, రూ.20 వేలు వసతి దీవెన గతంలో ఎప్పుడూ జరగలేదు. ఆరోగ్య రంగంలో ఆరోగ్యశ్రీలో దాదాపు 3వేల చికిత్సా విధానాలు, 16 కొత్తమెడికల్ కాలేజీల నిర్మాణం, నాడు-నేడుతో మొత్తం ఆసుపత్రుల పునర్వ్యవస్థీకరణ, ఆరోగ్య ఆసరా ఇవేవీ గతంలో లేవు. మహిళా సాధికారతలో చేయూత, ఆసరా, అమ్మఒడి, సున్నావడ్డీ, మహిళల పేరుమీదే ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ గతంలో ఎప్పుడూ జరగలేదు. ఒక్క బటన్ నొక్కి ప్రభుత్వం లబ్ధిదారులకు రూ. 1 లక్షా 65 వేల కోట్లు డీబీటీ ద్వారా జమ చేసింది. దేశంలో ఈ తరహా డీబీటీ విధానం లేదు. ఇవన్నీ కచ్చితంగా ప్రతిబింబించాలి.

ఎస్‌డీజీకి సంబధించిన కచ్చితంగా ఎస్ఓపీలు ఉండాలి. వాటిని నిరంతరం పాటించాలి. ఎన్ని రోజులకొకమారు సమావేశం

(మిగతా 2లో)

## "టిడ్కో" హౌసింగ్ ప్రాంతాలలో మౌలిక వసతులు పూర్తిచేయండి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఇప్పటికే నిర్మాణం పూర్తైన "టిడ్కో" హౌసింగ్ ప్రాంతాలలో మౌళిక వసతులు పూర్తిచేయాలని జివిఎంసి కమిషనర్ డాక్టర్ జి. లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. గురువారం జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని ఆయన ఛాంబర్ లో "టిడ్కో" ఇళ్ళ నిర్మాణం, వాటి మౌళిక వసతులు పై అధికారులతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నిర్మాణం పూర్తైన "టిడ్కో" ఇళ్ళ ప్రాంతాలలో మౌలిక వసతులైన రోడ్లు, కాలువలు, పార్క్, విద్యుత్, పచ్చదనం మొదలైన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని టిడ్కో హౌసింగ్ పర్యవేక్షక ఇంజినీరును ఆదేశించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా "టిడ్కో" హౌసింగ్ పై దృష్టి సారించారని అందుకు ఫేజ్ -1 లో పూర్తైన 4120 ఇళ్ళ లబ్దిదారులకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి వివరాలు, వాటి రిజిస్ట్రేషన్, బ్యాంకు ఋణం తదితర అంశాలు తెలియజేయాలని ప్రాజెక్ట్ డైరెక్టర్ (యుసిడి) పాపు నాయుడును ఆదేశించారు. ఫేజ్-2 కు సంబంధించి ఇల్లు నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసి లబ్దిదారులకు అందించేలా చర్యలు చేపట్టాలని ఇంజినీరింగు అధికారులను ఆదేశించారు. పనులు ఎక్కడా ఆగకుండా ప్రతి రోజూ జరగాలని, నిర్మాణంలో ఎటువంటి ఇబ్బందులు ఉన్న వెంటనే తెలియజేయాలని కమిషనర్ సూచించారు. ప్రతి రోజు జరుగుచున్న పనులను అధికారులు పర్యవేక్షించాలని, పనులు వేగవంతం అయ్యేలా సంబంధిత కాంట్రాక్టర్ కు తెలపాలని ఆదేశించారు. 300 చదరపు అడుగులతో నిర్మిస్తున్న "టిడ్కో"

(మిగతా 2లో)

## శ్రీలంక అధ్యక్షుడిగా రణిల్ విక్రమసింఘే ప్రమాణం



శ్రీలంక నూతన అధ్యక్షుడిగా రణిల్ విక్రమసింఘే బాధ్యతలు స్వీకరించారు. గురువారం ఉదయం శ్రీలంక పార్లమెంట్ కాంప్లెక్స్‌లో ఆయన అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. శ్రీలంక ఎనిమిదో అధ్యక్షుడిగా 73 ఏళ్ల విక్రమసింఘేతో ప్రధాన న్యాయమూర్తి జయంత జయసూర్య ప్రమాణ స్వీకారం చేయించారు. బుధవారం జరిగిన ఎన్నికల్లో గొటబాయ రాజపక్స స్థానంలో కొత్త అధ్యక్షుడిగా రణిల్ ను శ్రీలంక పార్లమెంటు ఎన్నుకుంది.

221 ఓట్లకు గాను విక్రమసింఘేకు మొత్తం 134 ఓట్లు వచ్చాయి. ఆయన ప్రధాన ప్రత్యర్థి దులాస్ అలహప్పెరుమకు 82 ఓట్లు లభించగా.. లెఫ్టిస్ట్ అనురా దిసానాయకు కేవలం మూడు ఓట్లు మాత్రమే లభించాయి. మొదటి ప్రాధాన్యత ఓటింగ్ లోనే రణిల్ కు పూర్తి మెజారిటీ లభించింది. ఎన్నికల్లో మొత్తం 223 ఓట్లు పోలవగా.. ఇద్దరు ఎంపీల ఓట్లు చెల్లుబాటు కాలేదు. విక్రమసింఘే గతంలో ఆరుసార్లు శ్రీలంక ప్రధానమంత్రిగా పని చేశారు.

ఎంతో అనుభవజ్ఞుడైన రాజకీయ నాయకుడు రణిల్ విక్రమసింఘే ముందు ఇప్పుడు ఎన్నో సవాళ్లు ఉన్నాయి. దేశాన్ని ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కించాల్సి ఉంటుంది. అలాగే, కొన్ని నెలలుగా ప్రజా ఆందోళనల తర్వాత పరిపాలనను పునరుద్ధరించాల్సిన బాధ్యత ఆయనపై ఉంది. కాగా, విక్రమసింఘే ఇప్పుడు తన క్యాబినెట్ కూర్పుపై దృష్టి పెట్టారు. కొన్ని రోజుల్లో 20-25 మందితో క్యాబినెట్‌ను ఏర్పాటు చేస్తారని సమాచారం.

## ఏపీపీఎస్సీ గ్రేడ్ -3 పోటీ పరీక్షకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఏపీపీఎస్సీ నిర్వహించబోతున్న పోటీ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస మూర్తి అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏపీపీఎస్సీ పరీక్షకు సంబంధించి నిర్వహణ ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ దేవాదాయ శాఖలో గ్రేడ్ -3 ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ల భర్తీకి ఈనెల 24వ తేదీ న ఆదివారం నాడు పరీక్ష జరుగనున్నదని తెలిపారు. ఈ పరీక్షకు 12119 మంది అభ్యర్థులు జిల్లాలో హాజరుకానున్నట్లు తెలిపారు. వీరి కోసం 30 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఏపీపీఎస్సీ వెబ్సైట్ నుంచి హాల్ టికెట్లను అభ్యర్థులు డౌన్లోడ్ చేసుకోవాలని ఆయన సూచించారు . అభ్యర్థులు హాల్ టికెట్ తో పాటు ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డు తప్పనిసరిగా తీసుకురావాలని తెలిపారు. కోవిడ్ పేషెంట్స్ ఎవరైనా ఉన్నట్లయితే వారికి ప్రత్యేక గదిలో పరీక్ష నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రశ్నాపత్రాలు చేరవేత మొదలుకొని పరీక్ష పూర్తయ్యాక బండిల్స్ ను ఏపీపీఎస్సీ కి చేరవేసే వరకు నిబంధనలను అనుసరించి పనిచేయాలని లైజనింగ్ ఆఫీసర్లు, సూపరింటెండెంట్ లకు ఆయన సూచించారు. పరీక్ష కేంద్రాలకు మొబైల్ ఫోన్లు, క్యాలిక్యులేటర్, స్మార్ట్ వాచెస్, ఇతర స్మార్ట్ పరికరాలను తీసుకురాకూడదని ఆయన చెప్పారు. అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే పరీక్షా కేంద్రంలోనికి అనుమతించాలని చీఫ్ సూపరింటెండెంట్ లకు ఆదేశించారు. ఉదయం గం. 10:30 ని.ల కల్లా అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని ఆయన అన్నారు. గం.10.45 ని.ల తర్వాత ఎట్టి పరిస్థితిలోనూ లోపలకు అనుమతించబోమని జిల్లా రెవెన్యూ అధికారి స్పష్టం చేశారు . పరీక్ష నిర్వహించబడు రోజున విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని, పరీక్షా కేంద్రాల వద్ద వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని , త్రాగు నీరు వంటి సదుపాయాలు అందుబాటులో ఉంచాలని సంబంధిత శాఖలకు ఆదేశించారు. అభ్యర్థికి స్క్రైబ్ అవసరమైన సందర్భంలో సదరు స్క్రైబ్ విద్యార్హత అభ్యర్థి విద్యార్హత కంటే తక్కువగా ఉండాలని ఈ విషయాన్ని పరిశీలించాకే పరీక్ష రాసేందుకు అనుమతించాలని ఆయన చెప్పారు. ఈ పరీక్షలు ఆఫ్ లైన్ పద్ధతిలో నిర్వహిస్తున్నందున అభ్యర్థులు బ్లూ లేదా బ్లాక్ బాల్ పాయింట్ పెన్నుతో మాత్రమే ఓ.ఎం.ఆర్ షీట్ పై బబ్లింగ్ చేయాల్సి ఉంటుదన్నారు. పరీక్షా కేంద్రానికి చేరుకునేలా అభ్యర్థుల అవసరాలను బట్టి బస్సులు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు.

(మిగతా 2లో)

## 27వ వార్డులో అభివృద్ధి పనులకు మేయర్‌చే శంఖుస్థాపన



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** రాష్ట్ర ముఖ్యమంత్రి వై ఎస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో నగరాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు సాయిశక్తులా కృషి చేస్తున్నట్లు నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. గురువారం ఆమె మూడవ జోన్, 27వ వార్డు పరిధిలోని శ్రీ నగర్, ద్వారకా నగర్ తదితర ప్రాంతాలలో రూ.93.15 లక్షల వ్యయంతో తారు రోడ్లు, సిసి కల్వర్టులు నిర్మాణానికి స్థానిక శాసనసభ్యులు వాసుపల్లి గణేష్ కుమార్, వార్డు కార్పొరేటర్ గొలగాని వీరరావు తో కలిసి శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ జగనన్న పాలనలో సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి కూడా సమపాళ్ళలో చేస్తున్నామని చెప్పారు. వార్డు కార్పొరేటర్ వీర రావు విన్నపం మేరకు వార్డులోని సమస్యల పరిష్కారానికి అంచెలంచెలుగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. వార్డులోని ప్రధాన సమస్యలైన త్రాగునీరు, విద్యుత్ దీపాలు, పారిశుధ్యం మొదలైన వాటిపై ఇప్పటికే దృష్టి కేంద్రీకరించి వాటిని అభివృద్ధి చేస్తున్నట్లు మేయర్ తెలిపారు.

(మిగతా 2లో)

## నగరంలో స్వచ్ఛతకే తొలి ప్రాధాన్యత



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** నగర స్వచ్ఛతకే మొదటి ప్రాధాన్యత ఇస్తున్నట్లు జివిఎంసి కమిషనర్ డాక్టర్ జి. లక్ష్మీశ పేర్కొన్నారు. గురువారం ఆయన క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా గాజువాక జోన్, 66వ వార్డు పరిధిలోని కణితి, అజీమాబాద్, కైలాస నగర్ బిసి రోడ్డు, ఇందిరా నగర్ కోలనీ తదితర ప్రాంతాలలో వార్డు కార్పొరేటర్ మహమ్మద్ ఇమ్రాన్ తో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విశాఖ నగర స్వచ్ఛతలో రాజీ లేకుండా పనిచేయాలని అధికారులను ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణలో ఎటువంటి అలసత్వం ప్రదర్శించరాదని, పారిశుధ్య కార్మికులు ఇంటింటి చెత్త సేకరణ చేయాలని, రోడ్లు, కాలువలు శుభ్రం చేయాలని చెత్త పోగులను ఎప్పటికప్పుడు తొలగించి డంపింగ్ యార్డుకు తరలించాలని ఆదేశించారు. వార్డులో ప్రజలు తడి, పొడి చెత్తను వేరుచేసి పారిశుధ్య కార్మికులకు అందించేలా చూడాలని సూచించారు. వార్డులో ప్లాస్టిక్ నిర్మూలన పూర్తి స్థాయిలో జరగడం లేదని, దుకాణాలను, టిఫిన్ సెంటర్లలో తనిఖీలు నిర్వహించి ప్లాస్టిక్ కలిగి వుండే వారి నుండి అపరాధ రుసుం వసూలు చేయాలని అధికారులను ఆదేశించారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ ను నిర్మూలించాలని అందుకు నగర పౌరులు, వ్యాపారులు, విద్యార్థులు ముందుకు వచ్చి మన సాగరాన్ని ప్లాస్టిక్ రహిత నగరంగా చేద్దామని పిలుపునిచ్చారు.

అనంతరం వార్డు కార్పొరేటర్ వార్డులోని సమస్యలను కమిషనర్కు వివరించగా కమిషనర్ స్పందిస్తూ కార్పొరేటర్ తెలిపిన ప్రతీ సమస్య మా దృష్టిలో ఉన్నాయని, వాని అంచలంచెలుగా పరిష్కరించే దశగా చూస్తానని తెలిపారు.

ఈ కార్యక్రమంలో

(మిగతా 2లో)

## 'ఆజాదీ కి రైల్ గాడీ ఔర్ స్టేషన్స్' వేడుకలు 23న ముగింపు

భారతీయ రైల్వేలు 23 జూలై, 2022న ఢిల్లీలో 'ఆజాదీ కి రైల్ గడీ ఔర్ స్టేషన్స్' ఐకానిక్ వీక్ సెలబ్రేషన్‌ల ముగింపు కార్యక్రమాన్ని నిర్వహిస్తాయి. రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. స్వాతంత్ర్య సమరయోధులు, వారి కుటుంబ సభ్యులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంభాషించనున్నారు.

ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ వేడుకల్లో భాగంగా భారతీయ రైల్వే జూలై 18 నుండి జూలై 23 వరకు 'ఆజాదీ కి రైల్ గడీ ఔర్ స్టేషన్స్' వారోత్సవాలను నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా స్వాతంత్ర్య పోరాటంలో గుర్తించిన 75 స్టేషన్లు/27 రైళ్ల ప్రాముఖ్యతను హైలైట్ చేశారు.

అన్ని జోన్‌లు/డివిజన్‌లు వాటి నామినేటెడ్ స్టేషన్‌ల ద్వారా (మొత్తం 75 ఫ్రీడమ్ స్టేషన్‌లు) ముగింపు కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కనెక్ట్ చేయబడతాయి. వీసీ ద్వారా జనరల్ మేనేజర్లు ఈ కార్యక్రమానికి హాజరవుతారు. ఈ మేరకు రైల్వే బోర్డు ఇప్పటికే అన్ని జోనల్ రైల్వేల జనరల్ మేనేజర్‌లకు లేఖ రాసింది.

ఈ వేడుక అన్ని జోన్‌లు/డివిజన్‌లలో వారి నామినేటెడ్ స్టేషన్‌ల ద్వారా (మొత్తం 75 ఫ్రీడమ్ స్టేషన్‌లు) టూ వే కమ్యూనికేషన్ లింక్‌తో ప్రత్యక్ష ప్రసారం చేయబడుతుంది.

## (మొదటి పేజీ తరువాయిలు)

### పథకాలలో ఏపీ దేశానికే తలమానికం

కావాలన్నదానిపై నిర్ధిష్టమైన సమాచారం ఉండాలి. గతేడాది ఇది లోపించింది, ఈ దఫా అలా జరగడానికి వీలులేదు. కచ్చితంగా ఎస్‌డీజీకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని అప్ డేట్ చేయాలి. విద్యాశాఖలో నూటికి నూరుశాతం ఎస్‌డీజీ లక్ష్యాలను సాధించాలన్న సీఎం. ప్రతినెలా సీఎస్ ఆధ్వర్యంలోనెలకు రెండుదఫాలుగా సమావేశం కావాలి. మూడు నెలలపాటు ఇలా సమావేశమవ్వాలి. ఎస్‌డీజీ మీటింగ్‌లో సెక్రటరీలు పాల్గొనాలి. కలెక్టర్లతోనూ మాట్లాడాలన్న సీఎం.

దాదాపు 7నుంచి 8 రంగాలలో వైద్యఆరోగ్యరంగం, విద్య, మహిళాసాధికారత, గృహనిర్మాణశాఖ, పంచాయతీరాజ్, సోషల్ జస్టిస్, మున్సిపల్‌శాఖ, పట్టణాభివృద్ధిలో అనేక కార్యక్రమాలు చేస్తున్నాం: అధికారులకు సీఎం నిర్దేశం.

విశాఖపట్నంలో ఐటీహబ్‌ను నిర్మించాలన్న సీఎం.. దీనిపై కార్యారణ రూపొందించాలన్నారు. అత్యాధునిక వసతులతో నిర్మించాలన్నారు. సమీక్షా సమావేశంలో సీఎస్ సమీర్ శర్మ, డీజీపీ కే వి రాజేంద్రనాథ్ రెడ్డి, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

### "టిడ్కో" హౌసింగ్ ప్రాంతాలలో మౌలిక వసతులు పూర్తిచేయండి

ఇళ్ళకు లోన్ ప్రక్రియ అవసరం వుండదు కాబట్టి వాటిని లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తిచేయాలని ప్రాజెక్ట్ డైరెక్టర్ (యుసిడి)ను ఆదేశించారు.

ఈ సమీక్షా సమావేశంలో పిడి(యుసిడి) పాపు నాయుడు, టిడ్కో పర్యవేక్షక ఇంజినీరు నరసింహమూర్తి, కార్యనిర్వాహక ఇంజనీరు సుధాకర్, ఉప కార్యనిర్వాహక ఇంజినీరు ఉమా మహేశ్వరి, యుసిడి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### ఏపీపీఎస్సీ గ్రేడ్ -3 పోటీ పరీక్షకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

పరీక్షలు జరిగే రోజు ఆయా కేంద్రాలకు చుట్టుపక్కల జిరాక్స్ షాపులు ఉంటే వాటిని మూసివేయాలని పోలీస్ శాఖ సిబ్బందికి ఆదేశించారు. ఈ పరీక్షల నిర్వహణకు అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని ఆయన ఆదేశించారు . ఈ పరీక్షకు ఎలాంటి లోపాలు తలెత్తకుండా పారదర్శకంగా నిర్వహించడానికి ప్రతి ఒక్కరూ తమ వంతు పాత్ర పోషించాలని దిశా నిర్దేశం చేశారు .

ఈ సమావేశంలో ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, భీమిలి ఆర్డీవో ఇంఛార్జి అనిత, ఏపీపీఎస్సీ అధికారులు, జీవిఎంసి, పోలీస్, మెడికల్, ఈపిడిసిఎల్, ఆర్టీసీ, వివిధ కాలేజీ ల లైజనింగ్ ఆఫీసర్లు, రెవెన్యూ సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

### 27వ వార్డులో అభివృద్ధి పనులకు మేయర్‌చే శంఖుస్థాపన

అనంతరం స్థానిక శాసన సభ్యులు మాట్లాడుతూ దక్షిణ నియోజకవర్గంకి మన ప్రియతమ ముఖ్యమంత్రి వై ఎస్ జగన్మోహన్ రెడ్డి 2 కోట్ల రూపాయల నిధులు కేటాయించారని, దక్షిణ నియోజకవర్గం లో ఉన్న వార్డులు అన్నింటినీ అభివృద్ధి పరిచేందుకు కృషి చేస్తానని తెలిపారు. వార్డులోని ప్రధాన సమస్యలను ఎప్పటికప్పుడు కార్పొరేటర్ ద్వారా తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ శివప్రసాద్, పర్యవేక్షక ఇంజనీర్ వేణుగోపాల్, కార్యనిర్వాహక ఇంజనీర్ శ్రీనివాస్, జివిఎంసి సిబ్బంది వైయస్సార్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### నగరంలో స్వచ్ఛతకే తొలి ప్రాధాన్యత

ప్రధాన వైద్యాధికారి డాక్టర్ కెఎస్ఎల్జి శాస్త్రి, జోనల్ కమిషనర్ పి సింహాచలం, ఉప కార్యనిర్వాహక ఇంజనీరు, సహాయక ఇంజనీరు, ఎపిడి, టిపిఎస్, శానిటరీ సూపర్వైజర్, శానిటరీ ఇన్స్పెక్టర్, వార్డు సచివాలయ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌ఎంఎస్ పోర్టర్‌లో విద్యార్థుల వివరాలు నమోదు చేయాలి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఆంధ్రవిశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలలో యూజీ కోర్సులను అభ్యశిస్తున్న విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఇంటర్న్‌షిప్‌లను అదిస్తుందని దీనికోసం విద్యార్థుల వివరాలను ఎల్‌ఎంఎస్ పోర్టర్‌లో అప్‌లోడ్ చేయాలని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ తెలిపారు. ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ఆచార్య కె.రామ మోహన రావు అద్యక్షతన వర్చువల్ విధానంలో గురువారం జరిగిన సమావేశంలో రిజిస్ట్రార్ కృష్ణమోహన్, ఏయూ సిడిసి డీన్ ఆచార్య ఎన్.సత్యనారాయణతో కలసి పాల్గొన్నారు.

అనంతరం మాట్లాడుతూ ఇప్పటికే ఏయూ పరిధిలో ద్వితీయ సం వత్సరానికి చెంది న 39,660 మంది విద్యార్థులకు 26,485 మంది వివరాలు ఎల్‌ఎంఎస్ పోర్ట ల్‌లో నమోదు చేసారని, మిగిలిన 13,175 మంది విద్యార్థుల వివరాలను సైతం వెంటనే అప్‌లోడ్ చేయాలని సూచించారు. విద్యార్థుల కోర్సులు, ఆసక్తికి అనుగుణంగా పరిశ్రమలు, వాణిజ్య సముదాయాలలో ఇంటర్న్‌షిప్‌లను రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. నూతన విద్యా విధానంలో సూచించిన విధంగా విద్యావ్యవస్థను పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా మార్పు చేస్తూ, విద్యార్థులకు నైపుణ్యాలను అందించే దిశగా ఈ కార్యక్రమం చేపట్టారన్నారు. సత్వరం కళాశాలల ప్రిన్సిపాల్స్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఎల్‌ఎంఎస్ పోర్టల్‌లో విద్యార్థుల వివరాలు సమగ్రంగా అప్‌లోడ్ చేయాలని సూచించారు.

## భారత్ సరిహద్దులకు దగ్గరగా చైనా మరో కుతంత్రం ఇదే!



చైనా నోటితో చెప్పేదొకటి.. చేసేదొకటి. ఇది చాలాసార్లు రుజువైంది కూడా. భారత్ తో సరిహద్దు సమస్యల పరిష్కారం కోసం ఓవైపు చర్చలంటూనే.. మరోవైపు భారత్ ను అన్ని వైపులా చుట్టుముడుతూ కుతంత్రాలకు పాల్పడుతోంది. ఓవైపు చర్చలు చేస్తూనే మరోవైపు హద్దులు దాటి భారత్ పరిధిలోకి చొచ్చుకు వస్తోంది. జమ్ముకశ్మీర్ ఉత్తరాఖండ్ పశ్చిమ బెంగాల్ సిక్కిం అరుణాచల్ ప్రదేశ్ ఇలా ఉత్తరం నుంచి ఈశాన్య దిక్కు వరకు భారత్ సరిహద్దుల్లోకి చొచ్చుకొస్తోంది.

ఇందుకోసం ఇప్పటిదాకా లేని గ్రామాలను సృష్టించడంతోపాటు వివాదాస్పద ప్రాంతాల్లో రోడ్లను వేస్తోంది. ఈ రోడ్లను జాతీయ రహదార్లకు అనుసంధానం చేస్తోంది. యుద్ధం సంభవిస్తే భారత్ సరిహద్దుల్లో ఏ మూలకైనా చొచ్చుకుపోయేలా సైన్యాన్ని చేరవేయడానికి యుద్ధ ప్రాతిపదికన గ్రామాలను రోడ్లను నిర్మిస్తోంది. కొద్ది రోజుల క్రితం సిక్కిం - భూటాన్ లకు అతి సమీపంలో డోక్లాం వద్ద చైనా ఒక కొత్త గ్రామాన్ని నిర్మించిన సంగతి తెలిసిందే. ఇందులో ప్రజలతోపాటు సైనికులు ఉంటారని తెలుస్తోంది.

ఇప్పుడు భారత్ - చైనా వివాదాస్పద ప్రాంతాలకు దగ్గరగా శరవేగంగా రహదార్లను నిర్మిస్తోంది. ప్రస్తుతం చైనా 1962లో ఆక్రమించుకున్న అక్సాయ్ చిన్ గుండా ఒక కొత్త హైవేను నిర్మించాలని యోచిస్తున్నట్లు మీడియా కథనాలు తెలుపుతున్నాయి.

ఈ హైవే భారతదేశ సరిహద్దు వెంబడి జింజియాంగ్ను టిబెట్తో కలుపుతుందని చెబుతున్నారు. వివాదాస్పద అక్సాయ్ చిన్ ప్రాంతం గుండా మరో కొత్త రహదారిని చైనా నిర్మిస్తోందని అంటున్నారు. దీని ద్వారా భారత్ లోని లడఖ్ అక్సాయ్ చిన్ ప్రాంతాల్లోని 38000 చదరపు కిలోమీటర్ల భూమిని తన ఆధీనంలోకి తీసుకుంటుందని పేర్కొంటున్నారు. ఇక ఈ కొత్త రహదారి 2035 నాటికి పూర్తవుతుందని వార్తలు వస్తున్నాయి. ఈ కొత్త రహదారి రెండు దేశాల మధ్య ఉన్న వాస్తవ నియంత్రణ రేఖకు దగ్గరగా వస్తుందని అంటున్నారు.

జమ్ముకశ్మీర్ లో ఉన్న అక్సాయ్ చిన్ నుంచి భారతదేశం నేపాల్ భూటాన్ సరిహద్దుల నుంచి అరుణాచల్ ప్రదేశ్ వరకు ఈ రహదారిని చైనా నిర్మిస్తోందని హాంగ్ కాంగ్ నుంచి వెలువడే సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ తెలిపింది.

చైనా నిర్మించే రహదారి ఇటీవల భారత్-చైనాల మధ్య ఉద్రిక్తతలకు కారణమైన అనేక వివాదాస్పద ప్రాంతాలకు దగ్గరగా వెళ్తుందని అంటున్నారు. తూర్పు లడఖ్ డోక్లాం దేప్సాంగ్ ప్లెయిన్స్ గాల్వాన్ వ్యాలీ హాట్ స్ప్రింగ్స్ వంటి తీవ్ర వివాదాస్పద ప్రాంతాలకు సమీపంలోకి ఈ రహదారి రావచ్చు అని చెబుతున్నారు.

ఈ నేపథ్యంలో మనదేశం ఎలా స్పందిస్తుదనేది ఆసక్తికరంగా మారింది. మరోవైపు ఇండియా కూడా ఇప్పటికే ఈశాన్య రాష్ట్రాల్లో భారీ ఎత్తున మౌలిక వసతులను అభివృద్ధి చేస్తోంది. యుద్ధ విమానాలు కూడా దిగేలా జాతీయ రహదారుల నిర్మాణం చేస్తోంది. ప్రత్యేక సైన్య శిబిరాలు ఆకాష్ త్రిశూల్ పృథ్వీ బ్రహ్మోస్ వంటి క్షిపణులను సరిహద్దుల్లో మోహరిస్తోంది.

## ప్రధాన రాష్ట్రాల కేటగిరీలో కర్ణాటక ప్రథమ స్థానం

**విజయవాడ, (పీఐబీ):** నీతి ఆయోగ్ విడుదల చేసిన మూడో 'భారత ఆవిష్కరణల సూచీ'లోని 'ప్రధాన రాష్ట్రాల' కేటగిరీలో కర్ణాటక ప్రథమ స్థానంలో నిలవగా, తెలంగాణ రెండోస్థానం దక్కించుకుంది. అలాగే మణిపూర్, చండీగఢ్ రాష్ట్రాలు సంబంధిత విభాగాల్లో అగ్రస్థానంలో నిలిచాయి. ఈ సూచీని ఇవాళ నీతి ఆయోగ్ వైస్-చైర్మన్ సుమన్ బెరీ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆయోగ్ సభ్యులు డాక్టర్ వి.కె.సారస్వత్, సీఈవో పరమేశ్వరన్ అయ్యర్, సీనియర్ సలహాదారు నీరజ్ సిన్హా, 'ఇన్‌స్టిట్యూట్ ఫర్ కాంపిటిటివ్‌నెస్' చైర్మన్ డాక్టర్ అమిత్ కపూర్ తదితరులు పాల్గొన్నారు. కాగా, 'ప్రధాన నగరాల' విభాగంలో కర్ణాటక రెండోసారి అగ్రస్థానం సాధించడం విశేషం. అలాగే 'ఈశాన్య-పర్వత రాష్ట్రాల' విభాగంలో మణిపూర్, కేంద్రపాలిత/నగర రాష్ట్రాల' విభాగంలో చండీగఢ్ అత్యుత్తమ పనితీరు కనబరిచాయి.

ఈ సందర్భంగా డాక్టర్ సారస్వత్ మాట్లాడుతూ- "సుస్థిర, సమ్మిళిత ప్రగతికి ఆవిష్కరణలు ఎంతో కీలకం. నేడు మనకు ఎదురయ్యే అతిపెద్ద సవాళ్లకు పరిష్కారం అన్వేషణలో తోడ్పడేది అవేబీ ఈ మేరకు కోట్లాది ప్రజలను పేదరికం నుంచి బయటపడేస్తాయి. జీవనోపాధి అవకాశాలను సృష్టిస్తాయి. అంతిమంగా స్వయం సమృద్ధ భారతానికి బాటలు పరుస్తాయి" అన్నారు. అనంతరం సీఈవో అయ్యర్ ప్రసంగిస్తూ- "భారత ఆవిష్కరణల సూచీ ద్వారా దేశంలో ఆవిష్కరణల స్థాయిని పర్యవేక్షించడంలో నీతి ఆయోగ్ నిరంతర నిబద్ధత చూపుతున్నదని నేను మరోసారి నొక్కిచెబుతున్నాను. ఇందులో భాగంగా రాష్ట్రాలు, ఇతర భాగస్వాములతో సంయుక్తంగా దేశమంతటా ఆవిష్యరణల పర్యావరణ వ్యవస్థను మెరుగుపరచేందుకు మేం కృషి చేస్తాం" అని చెప్పారు.

**ఆవిష్కరణల సూచీ అంటే ఏమిటి?**

దేశంలో ఆవిష్కరణల పర్యావరణ వ్యవస్థ ప్రగతిని అంచనా వేసేందుకు నీతి ఆయోగ్, 'ఇన్‌స్టిట్యూట్ ఫర్ కాంపిటీటివ్‌నెస్' సంస్థలు రూపొందించిన ఓ సమగ్ర ఉపకరణమే 'భారత ఆవిష్కరణల సూచీ.' రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ఆవిష్కరణ సామర్థ్యాన్ని ఈ ఉపకరణం మూల్యాంకనం చేసి, వాటికి ర్యాంకులు ఇస్తుంది. అదే సమయంలో ఆయా ప్రభుత్వాల మధ్య ఆరోగ్యకరమైన పోటీని ప్రోత్సహిస్తుంది. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ ఆవిష్కరణల సూచీ చట్రం ప్రాతిపదికగా రూపొందిన ప్రస్తుత మూడో వార్షిక సూచీ దేశంలో ఆవిష్కరణలపై విశ్లేషణ పరిధిని ప్రముఖంగా చూపుతుంది. మునుపటి సూచీ (భారత ఆవిష్కరణల సూచీ-2020)లో సూచికల సంఖ్య 36 కాగా, ఈసారి (భారత ఆవిష్కరణల సూచీ-2021)లో సూచీలు 66కు పెరిగాయి. ఈ సూచికలు ప్రస్తుతం 16 ఉప-స్తంభాలకు విస్తరించబడగా ఇవి తిరిగి ఏడు కీలక స్తంభాలను ఏర్పరుస్తాయి.

**భారత ఆవిష్కరణల సూచీ-2021 ర్యాంకుల వివరాలు**

భారత ఆవిష్కరణల సూచీ-2021 రూపురేఖలు గత సంవత్సరం తరహాలోనే ఉన్నాయి. ఆ మేరకు నిరుటి నివేదికలాగానే ఐదు 'సశక్తీకరణ' స్తంభాలు ఉత్పాదకాలను అంచనా వేస్తాయి. మిగిలిన రెండు 'పనితీరు' స్తంభాలు ఫలితాలను మూల్యాంకనం చేస్తాయి. సశక్తీకరణ స్తంభంలోని అన్ని సూచీలూ రాష్ట్రం/కేంద్రం పరిధిలో ఆవిష్కరణల ప్రోత్సాహానికి అవసరమైన కీలకాంశాలను పర్యవేక్షిస్తాయి. ఇక పనితీరు స్తంభాల్లోని సూచీలు జ్ఞాన సృష్టి, పోటీతత్వంలో దేశం ఉత్పాదకతను తేటతెల్లం చేస్తాయి. దేశ స్వావలంబన, ప్రతిరోధకతను ప్రోత్సహించడంలో ఆవిష్కరణల పాత్ర ఎంతో కీలకం. ఈ మేరకు అన్ని భారత రాష్ట్రాల్లో ఆవిష్కరణల వికేంద్రీకరణను సూచీలోని అంశాలు సూచిస్తాయని నీతి ఆయోగ్ సీనియర్ సలహాదారు నీరజ్ సిన్హా చెప్పారు.

ఈ 'ఇండెక్స్' కొన్ని అంతర్జాతీయ సమాంతర అంశాలనూ ఎత్తిచూపుతుంది. ఇది భారతదేశం అనుసరించే పద్ధతులను, ఇతర సమకాలీన దేశాలతో మనం సమానంగా ఉండటా'న్ని ఇది సూచిస్తుందని 'కాంపిటీటివ్‌నెస్ చైర్మన్' డాక్టర్ అమిత్ కపూర్ అన్నారు. ఇక భారత ఆవిష్కరణల సూచీ-2021 అనేది దేశాన్ని ఆవిష్కరణాధారిత ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడంలో భారత ప్రభుత్వ నిరంతర కృషికి భారత ఆవిష్కరణల సూచీ-2021 ఒక నిదర్శనం.

'సంస్కరణ-వృద్ధి' యంత్రాంగాన్ని నడిపించే దిశగా అంతర్జాతీయ సూచీల ద్వారా ఎంపిక చేసిన కొన్ని ప్రపంచ సూచీలను పర్యవేక్షించడంలో ప్రభుత్వ కృషికి నోడల్ సంస్థ హెూదాలో నీతి ఆయోగ్ రూపొందించే భారత ఆవిష్కరణల సూచీ దోహదం చేస్తుంది.

## హర్ ఘర్ తిరంగ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



**పార్వతీపురం మన్యం, (విశాఖ సమాచారమ్):** హర్ ఘర్ తిరంగ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రెవెన్యూ స్పెషల్ సిఎస్ రజిత్ భార్గవ్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. హర్ ఘర్ తిరంగ కార్యక్రమ ఏర్పాట్ల పై ఆయన గురువారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో ఏర్పాటు చేయనున్న జాతీయ జెండాలకు జియోట్యాగింగ్ తప్పని సరిగా ఉండాలన్నారు. రాష్ట్రంలో కోటి నలబై రెండు లక్షల జెండాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. జూలై 31 వ తేదీ నాటికి జెండాల పంపిణీ పూర్తికావలన్నారు. జెండాలు ఎగురవేయుటకు కావలసిన ఫోల్స్ అటవీశాఖ వారు సమకూర్చాలని తెలిపారు. ఆగష్టు రెండవతేది నుండి పదిహేను తేది వరకు ప్రతి రోజు చేపట్టవలసిన కార్యక్రమాలు షెడ్యూలు ప్రకారం నిర్వహించాలని తెలిపారు. పాఠశాలలలో కార్యక్రమం ఏర్పాటుచేయాలని, జాతీయ గీతాలు ఆలపించాలని తెలిపారు. ప్రజలందరూ పాల్గొనే విధంగా జాగృతం చేయాలన్నారు. పింగళి వెంకయ్య జయంతి ఉత్సవాలు, వ్యాసరచన పోటీలు, చారిత్రక ప్రదేశాలు సుందరీకరణ, స్వాతంత్ర్య సమరయోదులు సన్మానం, వారి కుటుంబసభ్యుల పరామర్శ, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. ర్యాలీలు, చిత్రలేఖనం పోటీలు, పోస్టరు తయారీలో పోటీలు, ఆటలు పోటీలు, పాదయాత్రలు నిర్వహించాలని సూచించారు. జిల్లా స్థాయిలో కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని చెప్పారు.

11 తేది నుండి 15 తేదీ వరకు స్వచ్ఛసంకల్పం కార్యక్రమం చేపట్టాలని తెలిపారు. ప్రముఖుల విగ్రహాలు శుభ్రం చేయాలని, ముఖ్య ప్రదేశాలు, స్వాతంత్ర్య సమరయోదుల గృహాలు, చారిత్రత ప్రదేశాలను శుభ్రంచేయాలన్నారు. సినిమా దియేటర్లు, సోషల్ మీడియా ద్వారా ఈ కార్యక్రమంలో ప్రచారం చేయాలని, హెూర్డింగ్స్, పత్రికా ప్రకటనలు, విజయగాధలు, బ్యానర్లు, గొడపత్రికలు, వార్తాపత్రికలలో ప్రకటనలు ద్వారా ప్రచారం గావించాలని తెలిపారు. కార్మికశాఖ, పరిశ్రమలశాఖ వారి పరిధిలో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, తప్పని సరిగా నిర్వహించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ హర్ ఘర్ తిరంగ కార్యక్రమాన్ని విజయవంతం చేయుటకు ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ తో పాటు జిల్లా జాయింట్ కలెక్టర్ ఒ. ఆనంద్, జిల్లా రెవిన్యూ అధికారి వెంకటరావు పాల్గొన్నారు.

శుక్రవారం 22-7-2022
శుభకృత్ నామ సంవత్సరము
దక్షిణాయనం గ్రీష్మ రుతువు
ఆషాఢ మాసం

పంచాంగం

తిథి : బ. నవమి ఉ. 09.34
నక్షత్రం : భరణి సా. 04.29 వ.
వర్జ్యం : లేదు



సమస్యలతో సతమతమవడం కంటే సాధకుల సహాయం కోరుట మేలు.
బ్రహ్మశ్రీ హనుమద్దాస్ స్వామీజీ గారు ప్రస్తుతం చెన్నై నగరంలో ఉన్నారు.
సెల్ : 9440537607

### మారుతీ సుజుకి గ్రాండ్ అత్యంత ఇంధన-సమర్థవంతమైనం ఎస్‌యువి

**ఇండియా, (విశాఖ సమాచారమ్):** నెక్సా తన 7వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని, మారుతీ సుజుకి నేడు తన గేమ్-ఛేంజర్ ఎస్‌యువి, ది గ్రాండ్ వితారాను విడుదల చేసింది. నెక్సా తన "క్రియేట్. ఇన్‌స్పైర్" అనే విలువల ప్రకటన కట్టుబడి గ్రాండ్ వితారాను దేశంలోని ఎస్‌యువి మార్కెట్‌కు ప్రవేశపెడుతున్న మల్టీ-ప్రొడక్ట్ ఆఫర్‌గా అందిస్తోంది.

నెక్సాకు సంబంధించిన సిగ్నేచర్ డిజైన్ లాంగ్వేజ్-క్రాఫ్టెడ్ ఫ్యూచరిజం, ప్రీమియం ఎస్‌యువి ప్రత్యేకమైన ఎక్స్‌టీరియర్ డిజైన్, అధునాతన ఇంటీరియర్స్, సెగ్మెంట్-లీడింగ్ ఫీచర్లు మరియు దాని విప్లవాత్మక హైబ్రిడ్ పవర్ ట్రైన్‌ల ఆధారితమైన ఇంధన సామర్థ్యంతో పరిశ్రమను పునర్నిర్వచించే దిశలో వినియోగదారులకు అందుబాటులోకి వస్తోంది.

దీని విడుదలను నేపథ్యంలో మారుతీ సుజుకి ఇండియా లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ మరియు సీఈఓ హిసాషి టేకుచి మాట్లాడుతూ, "నేటి-తరం భారతీయ వినియోగదారుల విభిన్న అవసరాలను తీర్చేందుకు మారుతి సుజుకి తన కొత్త ఉత్పత్తులను ఆయా విభాగాల్లో విడుదల చేస్తూ మార్కెట్‌ను ముందుకు నడిపిస్తోంది.

## రీసర్వే త్వరితగతిన పూర్తి చేయాలి



**పార్వతీపురం మన్యం, (విశాఖ సమాచారమ్):** రీసర్వే పనులు త్వరితగతిన పూర్తిచేయాలని సిసిఎల్‌ఎ కమీషనర్ సాయి ప్రసాద్ తెలిపారు. జగనన్న శాశ్వత భూ హక్కు కు సంబంధించిన భూముల రీ సర్వే పనుల పురోగతిని జిల్లా కలెక్టర్లుతో గురువారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీ జయంతి అక్టోబర్ 2 నాటికి భూ హక్కు పత్రాలు భూయజమానులకు ఇచ్చేందుకు సిద్దం చేయాలని, అందుకు అనుగుణంగా భూ రీ సర్వే పనులు వేగవంతం చేయాలని తెలిపారు. రీసర్వే విధులలో అలసత్వం చూపకూడదని, రీసర్వే విధులలో నిర్లక్ష్మం వహించే సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో నిర్దేశించిన లక్ష్యాలు మేరకు పనులు జరుగుతున్నట్లు తెలిపారు. నిర్లక్ష్యం వహంచే సిబ్బందిపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని తెలిపారు. భూ సర్వే పనులు జరుగుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఒ. ఆనంద్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటరావు, సర్వే సహాయ సంచాలకులు, తదితరులు పాల్గొన్నారు.

### యువత అసాంఘిక చర్యలకు పాల్పడకుండా చూడాలి

#### యువతపై స్పెషల్ డ్రైవ్



**కలెక్టరేట్, (విశాఖ సమాచారమ్):** గురువారం విశాఖపట్నం సిటీ పరిధిలోని 3 వ పట్టణ పోలీస్ స్టేషన్ లో హర్షిత చంద్ర ఏ.సి.పి(ఈస్ట్) ఈ సమావేశంలో ఏ.సి.పి గారు మాట్లాడుతూ 73 వాహనాలతో పాటు 85 మంది బైక్ రేసింగ్ నందు అదుపులోకి తీసుకున్నామని, అందులో 30 వరకు విద్యార్థులు వున్నారు. వీళ్లకు కౌన్సెలింగ్ ఇవ్వడం జరుగుతుందని వారంతాలలో బీచ్ రోడ్ నందు దృష్టి పెడుతున్నామని, ఎక్కడ స్టంట్ స చేస్తున్నరో అక్కడ స్పెషల్ డ్రైవ్ పెట్టడం జరుగుతుందని, ఇంస్టాగ్రామ్ మరియు ఇతర సోషల్ మీడియా గ్రూపులపై దృష్టిసారించమని, ర్యాష్ డ్రైవింగ్ వల్ల ఇతరులకు ప్రమాదం జరిగే అవకాశం ఉంది కావునా యువత ఇటువంటి అసాంఘిక చర్యలకు పాల్పడకుండా ఉండాలని తెలియజేశారు.

అనంతరం ఈ బైక్ రైసర్ల తల్లిదండ్రులకు పిలిచి స్టేషన్ ఆవరణలో మాస్ కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగినది.

# విశాఖ సమాచారమ్

శుక్రవారం 22-7-2022


## నీకుగా నువ్వు బతుకు

జనరల్ బోగీలో వెళ్ళినా, ఫస్ట్ క్లాస్ లో ప్రయాణించినా స్టేషన్ రాగానే ఒకేసారి దిగిపోతారు.

పక్కనెంత మందున్నా, ఎంత సంపదున్నా ఏంటి 30 లక్షల కారైనా, 3 వేల సైకిలైనా రోడ్డు ఒకటే.. పదంతస్తుల మేడైనా, పూరిగుడిసైనా వదిలేసే పోవాలి.

ఇద్దరు కొట్టుకుంటే.. ఒక్కరే గెలుస్తారు. రాజీపడితే ఇద్దరూ గెలుస్తారు.

ఐకమత్యం అంటే మనం కుక్కమీద రాయి విసిరితే కుక్కపారిపోతుంది. అదే.. తేనెతుట్ట మీద విసిరితే మనమే పారిపోవాలి.

దేవుడి కోసం తీర్థాలు, పుణ్య క్షేత్రాలంటూ తిరుగుతావ్, ఆయనెక్కడో లేడు. శ్వాస తీసుకుంటూ సృష్టితో నువ్వేసుకున్న 'లంకె'లోనే వున్నాడు.

కష్టమొస్తే భగవంతుణ్ణి కొలుస్తావు. ఆయన నీకు రాబోయే కష్టాన్ని ఆపడు. నిత్యం స్మరిస్తే కొండంత కష్టాన్ని గోరంత చేసి, సులువుగా దాటే శక్తి నీకిస్తాడు. కష్టాలు కుంభవృష్టిలా నిన్ను ముంచేస్తే... నీకు గొడుగుపట్టి కాపాడతాడు... గుర్తుంచుకో.

కొబ్బరిచెట్టు పెరిగే కొద్దీ పాత మట్టలు రాలిపోతాయి. జ్ఞానం కలిగే కొద్దీ తన పర భేదాలు తొలగి పోతాయి.

పుండు మానితే పొలుసు అదే పోతుంది. పుండు మానకుండానే పొలుసు పీకేస్తే పుండు తీవ్రమై రక్తం కారుతుంది జ్ఞానసిద్ధి అంచెలంచెలుగా కలగాలి. ఆత్రపడితే లాభం లేదు !

సముద్రమంత సమస్యొచ్చిందని దిగులుపడకు. ఆకాశమంత అవకాశం కూడా వుంది. తలెత్తి చూడు ముందు. నీపై నీకు నమ్మకం కావాలి.

నీపై నమ్మకం నీకు బలం. నీపై అపనమ్మకం అవతలివారికి బలం !నీ బలం ఎవరికీ తెలియక పోయినా నీవు బ్రతికేయవచ్చు.. నీ బలహీనత మాత్రం ఎవరికీ తెలియనివ్వకు నిన్ను నిన్నుగా బ్రతకనివ్వరు !

మరణం అంత మధురమైనదా ? ఒక్కసారి దాన్ని కలిసిన వారు వదిలిపెట్ట లేరు ?ప్రకృతికి కూడా అదంటే ఎంత పక్షపాతం ! ప్రాణం పోయిన జీవుల్ని నీళ్ళలో తేలుస్తుంది. ప్రాణమున్న జీవుల్ని నీళ్ళలో ముంచుతుంది.

నీ పరిసరాలనెంత శుభ్రంగా వుంచినా నీకు అనారోగ్యం రావచ్చు. బుద్ధి అనే ఆసుపత్రిలో ఆలోచనలు అనే వైద్యుడు నీ రోగాలను తగ్గించగలడు. వాటిని ఆరోగ్యంగా వుంచుకో.

వెంటరాని ఇంటిని, ఒంటిని రోజూ కడుగుతావ్.. నీవెంట వచ్చే మనసునెప్పుడు కడుగుతావు ?

నిజాయితీపరులు సింహం లాంటి వాళ్ళు. సింహం కూర్చోటానికి సింహాసనమెందుకు ?

అదెక్కడ కూర్చుంటే అదే సింహాసనం. నిజమైన నిజాయితీపరులకు గుంపు అక్కర్లేదు !

ముని-మహర్షి-తపస్వి-యోగి.. వీరు వేరు వేరు.

మౌనంగా వుండేవాడు ముని.

నియమ నిష్టలతో తపింప చేసుకునే వాడు తపస్వి.

అతీంద్రియ శక్తుల్ని ఆకళింపు చేసుకున్నవాడు ఋషి.

ధ్యానంలో మునిగి వుండేవాడు యోగి.

పండు తింటే అరిగిపోతుంది. తినకపోతే ఎండిపోతుంది. జీవితం నువ్వు ఖుషీగా గడిపినా, భయపడుతూ గడిపినా కరిగిపోతుంది !

ఇప్పటిదాకా ఇతరుల కోసమే (నా వాళ్ళనుకుంటూ) బతికేశావు. ఇప్పటికైనా ఆరోగ్యంగా, ఆనందంగా నీకోసం నువ్వు బతుకు.

వచ్చే జన్మలో నువ్వెవరో, ఎక్కడ, ఎలా పుడతావో, అసలు జన్మ వుందో లేదో తెలీదు.

నువ్వు 'నా వాళ్ళు నా వాళ్ళు' అనుకుంటుంటే వాళ్ళు తర్వాత 'వాళ్ళ వాళ్ళ కోసమే' బతుకుతారు. నీకంటూ ఎవరూ ఉండరు. ఏమీ మిగలదు !

అర్థం చేసుకుంటే.. పుట్టిందగ్గర్నుంచీ- పోయేందుకే మన ప్రయాణం ! ఈ మాత్రం దానికి పుట్టటమెందుకో తెలియదు. తెలుసుకోటం లోనే వుంది కిటుకంతా.. అందుకే ఈ జీవితమంతా !

మరణం దగ్గర పడితేనే మహా సత్యాలు బోధపడ్తాయ్.

పని చేయటానికి పనిమనిషి దొరుకుతుంది. వంట చెయ్యటానికి వంటవాళ్ళు దొరుకుతారు. రోగమొస్తే నీ బదులు భరించటానికి ఎవరూ దొరకరు.

వస్తువుపోతే దొరకచ్చు.. జీవితం పోతే మళ్ళీ దొరకదు తెరపడే రోజు ఏం తెలిసినా ప్రయోజనమేంటి ? లోక సమస్తా సుఖినోభవంతు.

మానవులుగా బతకటం కాదు.మానవత్వంతో బతకాలి.

## పంచాయతీ కార్యదర్శి అప్పారావు చేసిన సేవలు ఎనలేనివి



**పాడేరు/చింతపల్లి, (విశాఖ సమాచారమ్):** చింతపల్లి పంచాయతీ కార్యదర్శి గా ఎర్ర బొమ్మల పంచాయతీకి అప్పారావు చేసిన సేవలు ఎనలేనివని సీ పీ ఐ పార్టీ ఎర్ర బొమ్మల ఎంపీటీసీ సభ్యుడు సెగ్గే సత్తి బాబు, సర్పంచ్ లోతా పండయ్య అన్నారు. ఆ పంచాయతీలో మూడేళ్లు పనిచేసిన అప్పారావు మాకవరపాలెం మండలం మల్లవరం పంచాయతీకి బదిలీ కావడంతో ఎర్ర బొమ్మల పంచాయతీ లోని అన్ని శాఖల ఉద్యోగులు, అన్ని పార్టీలకు చెందిన ప్రజా ప్రతినిధులు, నాయకులు, అభిమానులు, శ్రేయోబిలాషులు ఆయనకు ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా వక్తలు పంచాయతీ అభివృద్ధికి ఆయన చేసిన సేవలను, అందించిన ప్రోత్సాహాన్ని కొనియాడారు. అనంతరం ఆయనను పార్టీలుకు అతీతంగా, అలాగే పంచాయతీ పరిధిలోని అన్ని శాఖల ఉద్యోగులు దుష్సాలువాలతో సత్కరించి, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ సభ్యుడు సత్తిబాబు మాట్లాడుతూ మూడేళ్లు గా ఈ పంచాయతీ లో ప్రజలకు సేవలు అందించిన అప్పారావు వివాద రహితునిగా ఉంటూ అటు అన్ని రాజకీయ పార్టీల వారినీ, ఇటు అన్ని శాఖల ఉద్యోగులను సమన్వయం చేసుకుంటూ పంచాయతీలోని అన్ని గ్రామాల ప్రజలకు అభిమాన ఉద్యోగిగా సేవలు అందించారన్నారు. సర్పంచ్ లోతాపండయ్య మాట్లాడుతూ శాంత స్వభావం, ఇతరులకు సేవ చేయాలన్న సంకల్పంతో అప్పారావు ఈ పంచాయతీ ప్రజలకు మూడేళ్ల పాటు సేవలు అందించారన్నారు. నిస్వార్ధ పరునిగా సేవలు అందించి అటు ప్రజల, ఇటు పాలకుల, అధికారుల, రాజకీయ నాయకులలో తన స్థానాన్ని పదిల పరచుకొని బదిలీపై వెళుతున్న అప్పారావు ఆరోగ్యంగా ఉండి ఉద్యోగ రిత్యానే గాక, ఆయనకు గల సేవా కార్యక్రమాలలోనూ ముందుకు సాగాలనివారు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సంధర్భంగా మరో పంచాయతీ కార్యదర్శి రాజేష్, సచివాలయం సిబ్బంది ని పంచాయతీ ప్రజలు దుస్సాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకుడు సెగ్గే కొండల రావు, బురిటి సత్యనారాయణ, తెదేపా మండల మాజీ అధ్యక్షుడు బేరా సత్యనారాయణ, బేరా రామలింగం పడాల్, వీ ఆర్ వో సోమలింగం, అన్ని శాఖల ఉద్యోగులు, మహిళా సంరక్షణ అధికారినిలు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్ లు, పంచాయతీలోని వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా పైడితల్లమ్మ వారి పండగ



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** జీవీఎంసీ 84వ వార్డు,విలీన గ్రామమైన కొండకొప్పాక గ్రామంలో ప్రసిద్ధిగాంచిన శ్రీ పైడితల్లి అమ్మవారి పండుగ ఘనంగా జరిగింది . ఆలయ నిర్వాకులు ఆహ్వానం మేరకు ప్రముఖ వ్యాపారవేత్త ముత్యాల గార్మెంట్స్ ,ఇండస్ట్రీస్ అధినేత ముత్యాల వెంకటేశ్వరరావు తనయులు అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలురాజేష్ ,సతీష్ లను గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బాలగణపతి సేవా సంఘం సభ్యులు, రామాలయం యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## చిట్టివలస జ్యూట్ మిల్ మూరు పేరు కోసం పిఎఫ్ కమిషనర్ను కలిసిన వరహాలరాజు



**భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్):** చిట్టివలస జ్యూట్ మిల్ మూరు పేర్లు కోసం ఢిల్లీలో సెంట్రల్ పి. ఎఫ్. కమిషనర్ జగ్ మోహన్ ని కలవడం వారికి సమస్య వివరించి మెమొరాండం ఇవ్వడం జరిగింది. వారు విశాఖపట్నం పి. ఎఫ్. కమిషనర్ తో మాట్లాడి వారికి కూడ రిపోర్ట్ అందచేయమని చెప్పడంతో గురువారం రీజినల్ పి. ఎఫ్. కమిషనర్ విజయకుమార్ ప్రసాద్ పి. ఎఫ్. మణికంఠతో సమావేశమై రిపోర్ట్ అందచేశారు. ఇంకో 15 రోజుల్లో మరొకసారి పిలుపు వస్తుందని నేషనల్ ఇంటక్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కాకర్లపూడి వరహాల రాజు తెలియచేశారు. విశాఖపట్నం ఇంటక్ నాయకులు, జిల్లా ఇంటక్ అధ్యక్షులు మంత్రి రాజశేఖర్ ,జిల్లా ఇంటక్ , ముఖ్య ఉపాధ్యక్షులు, (చిట్టివలస జూట్ మిల్ యూనియన్ అధ్యక్షులు) కె. వి. వరహాలరాజు,. ఇంటక్ జిల్లా. ప్రధాన కార్యదర్శి భోగ విల్లి నాగభూషణం. పాల్గొన్నారు.

## వైసిపి ఎంపీల కపట నాటకం



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రత్యేక హోదా తీసుకువచ్చి నిరుద్యోగ యువకులకు లక్షలాది ఉద్యోగాలు ఇస్తామని యువతరాన్ని మోసం దగా చేసిన జగన్ మోహన్ రెడ్డి పార్లమెంటు సాక్షిగా సంబంధిత మంత్రి మాట్లాడినప్పుడు వైసిపి పార్లమెంట్ సభ్యులు మౌనం పాటించి రాష్ట్రం పరువు తీసారని మీడియా కోఆర్డినేటర్ కొణతాల వెంకటరావు తీవ్రంగా వైసీపీ ఎంపీలు వైఖరిని ఖండించారు. తెలుగుదేశం పార్టీ ఎంపీ కింజరపు రామ్మోహన్ నాయుడు వేసిన ప్రశ్నకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ సమాధానం ఇస్తూ ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ముగిసిపోయిన అధ్యాయమని మరొకసారి చెప్పడం గర్వినీయమని వెంకటరావు అన్నారు. 2014లో విభజన చట్టంలోని ఇచ్చిన హామీలు చాలా అమలు చేశామని మిగతా కొన్ని అంశాలు అమల్లో ఉన్నాయని రాష్ట్ర ప్రజలను మోసగించడమేనని వెంకటరావు పేర్కొన్నారు. అదే విధంగా కేంద్ర ప్రభుత్వం మరోసారి పార్లమెంట్ సాక్షిగా విశాఖ ఉక్కు ప్రైవేటిక నిర్ణయాన్ని ప్రకటించిందని దీనిపై కూడా వైసిపి ఎంపీలు మౌనం వహించారని విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ప్రకటించినప్పుడు నుండి స్టీల్ ప్లాంట్ ఉద్యోగులు 525 రోజులుగా పోరాటాలు చేస్తున్నారని అయినప్పటికీ ప్రభుత్వంలో కదలిక లేదని మొండి వైఖరితో ప్రైవేటీకరణ చేస్తామని ప్రకటించడం దుర్మార్గమని వెంకటరావు అన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచడానికి ఆనాటి ప్రభుత్వాలు ప్రభుత్వ రంగ పరిశ్రమలను స్థాపిస్తే నేటి ప్రభుత్వాలు వాటిని నిర్వీర్యం చేస్తున్నాయని వెంకటరావు విమర్శించారు. విశాఖ ఉక్కు కార్మికులు శిబిరం వద్దకు వెళ్లి విజయ్ సాయి రెడ్డి వైసీపీ పార్లమెంట్ సభ్యులు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మద్దతు ఇస్తామని మీ తరపున మేము పోరాటం చేస్తామని అవాకులు చెవాకులు చెప్పి నిన్న జరిగిన పార్లమెంట్ సమావేశంలో విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ చేసి తీరుతామని ప్రకటనపై కనీసం గొంతు విప్పలేదని వారి నిరసన కూడా తెలియజేయలేదని దద్దమ్మల మాదిరిగా మౌనరాగం పాటించారని విశాఖ ఉక్కు పై విజయ్ సాయి రెడ్డి గ్యాంగ్ దొంగ నాటకం బయటపడిందని ద్వంద వైఖరి రెండు నాలుకల ధోరణితో వ్యవహరించారని వీరి కపట నాటకం మరోసారి బయట పడిందని వెంకటరావు మండిపడ్డారు.

## మన కుటుంబం ట్రస్ట్ పిల్లలకు విందు



**భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్):** ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆఫ్ భీమిలి (ఫాట్) ఆధ్వర్యంలో వడ్లమాని రమ ఆర్థిక సహాయంతో గొల్లల పాలెం మన కుటుంబం ట్రస్ట్ బాలలకు రీబూట్ హోటల్ లో విందు ఏర్పాటు చేశారు. ముందుగా పిల్లల చేత కేక్ కట్ చేయించి విందు కార్యక్రమాన్ని ప్రారంభించారు.

పిల్లలకు విందు ఏర్పాటు చేయడం పై మన కుటుంబం ట్రస్ట్ ప్రతినిధి వెంపాడ శ్రీనివాస రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఫాట్ ప్రతినిధులు సన్నీ కాళ్ళ, సూర్య శ్రీనివాస్ ముసునూరి, కట్టమూరి అశోక్, గుగ్గిళ్ల సాయి, మన కుటుంబం ప్రతినిధులు వెంపాడ శ్రీనివాస రెడ్డి, అవినాష్ పాల్గొన్నారు.

## రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షులు జంగా క్రిష్ణమూర్తికి అభినందనలు



**ఆరిలోవ, (విశాఖ సమాచారమ్):** శాసన మండలి సభ్యులు , రాష్ట్ర బిసి సెల్ అధ్యక్షులు జంగా కృష్ణమూర్తి విశాఖపట్నం వచ్చిన సందర్భంగా విశాఖపట్నం మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లంపల్లి రాజుబాబు, రాష్ట్ర మత్యకార కార్పొరేషన్ డైరెక్టర్ పేర్ల విజయ చందర్, విశాఖపట్నం, బి.సి విభాగం అధ్యక్షురాలు సత్యాల సాగరిక, తూర్పు యస్సీ సెల్ ఇంఛార్జి గుడపాటి విక్టర్, తూర్పు పార్టీ సీనియర్ నాయకులు వానపల్లి ఈశ్వర రావు ,ఎన్ .హెచ్. ఆర్. పి, జాతీయ ఎస్సీ, ఎస్టీ ఇంఛార్జి పారిపల్లి రామారావు , సీనియర్ నాయకులు సత్యాల వెంకట్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి అభినందనలు తెలియజేశారు.

## వైద్యసేవలకు ఢోకా లేదు

**పాడేరు/చింతూరు, (విశాఖ సమాచారమ్):** జిల్లాలోని చింతూరు ఐటీడీఏ పరిధిలో కల చింతూరు ఎటపాక వి.ఆర్.పురం కూనవరం మండలాలలో వరదనీటి ప్రభావం 215 వరకు గ్రామాలపై పడిన విషయం విదితమే. ఆయా గ్రామాలలోని ప్రజలను 82 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి తరలించడం జరిగిందని వరదల ప్రత్యేక అధికారి కార్తికేయ మిత్రా కార్తికేయ మిత్రా స్పష్టం చేశారు స్పష్టం చేశారు. ప్రస్తుతం వరద తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో పునరావాస కేంద్రాలనుండి వారి వారి గ్రామాలకు తరలి వెళ్తున్నారని తెలిపారు. వరద బాధితుల ఆరోగ్యానికి లోకల్ లేకుండా వైద్య సేవలు అందిస్తున్నామని, అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టామని స్పష్టం చేశారు. నాలుగు మండలాల్లో 110 ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం ద్వారా డోకా లేకుండా వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. అదేవిధంగా పునరావాస కేంద్రాల నుండి ఐదుగురు గర్భిణులను ముందుగానే భర్త్ వెయిటింగ్ వసతి గృహానికి తరలించామని, అవసరమైన బ్లడ్ ప్యాకెట్లను రాజమంద్రి నుంచి తెప్పించామని, నిపుణులైన డాక్టర్ల ను విశాఖపట్నం రాజమండ్రి నుండి తెప్పించామని తెలిపారు. అదేవిధంగా రోగులకు వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. చింతూరు, కూనవరం ఆస్పత్రులలో జనరేటర్ ఉపయోగించి 24 గంటల సేవలు అందిస్తున్నామన్నారు.

వరద బాధితులకు తక్షణ ఆర్థిక సహాయం కింద ప్రతి కుటుంబానికి రెండు వేల రూపాయలు చొప్పున ఇప్పటివరకు ఆరు కోట్ల రూపాయల పంపిణీ చేయడం జరిగిందని, మిగిలిన వారికి కూడా పంపిణీ జరుగుతోందని ఎస్ ఓ తెలిపారు. వరద ప్రభావం కి గురైన నాలుగు మండలాల్లో ప్రతి మండలానికి ఒక ఐఏఎస్ స్థాయి అధికారిని ప్రత్యేక అధికారిగా నియమించామని వారి ఆధ్వర్యంలో నిత్యావసర సరుకుల పంపిణీ జరుగుతోందని ఎస్ ఒ వివరించారు. ఫైర్ టెండర్లను ఉపయోగించి రోడ్లపై ఉన్న బురదను తొలగించడం జరుగుతుందని తెలిపారు. వి ఆర్ పురం నుండి కూనవరం వరకు రహదారి మధ్యలో వంతెన సరిగా లేనందున అటవీ మార్గం గుండా ఉన్న రోడ్డును తెరిపించి నిత్యవసర సరుకులు పంపిణీకి సరఫరా చేస్తున్నామని, నిన్నటి వరకు లాంచీల ద్వారా సరఫరా చేశామని తెలిపారు.



వరద ప్రభావం ఉన్న నాలుగు మండలాల్లో నెట్వర్క్ సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని అందులో భాగంగా జియో, బిఎస్ఎన్ఎల్ కనెక్ట్ అవుతున్నాయని, మరో 24 గంటల్లో మిగిలిన నెట్వర్కులు కూడా అందుబాటులోకి వస్తాయని ఎస్ ఓ తెలిపారు. ఈరోజు ఉదయం నుండి ఎన్యూమరేషన్ ప్రారంభించామని తెలిపారు. సామాజిక రక్షిత మంచినీటి పథకాలు కూడా నీటమునిగి నందున, నీరు తగ్గిన వెంటనే మోటార్లను పరిశీలించి, మరమ్మతులు పూర్తి చేసి నీటి సరఫరా చేస్తామని తెలిపారు. గురువారం సాయంత్రానికి చింతూరు ప్రధాన కేంద్రంకు విద్యుత్ పున రుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

## జి. ఓ. నెం. 117ను రద్దు చేయాలని భీమిలి జనసేన నాయకులు నిరసన



**భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్):** ప్రభుత్వం తీసుకు వచ్చిన జి . ఓ. 117 ను రద్దు చేయాలని భీమిలి జనసేన పార్టీ నాయకులు గుడివాడ.కిరణ్, నవిరి.రాజు, వెంకటేష్ హేమంత్, రాజు మరియు జన సైనికులు పాల్గొని భీమిలి మండల పరిధిలో ఉన్న ప్రాథమిక పాఠశాలల ముందు నిరసన తెలియజేశారు. ఈ సమస్యను జనసేన పార్టీ భీమిలి నియోజకవర్గం ఇంఛార్జి సందీప్ ద్వారా అధ్యక్షులు పవన్ కళ్యాణ్ వద్దకు తీసుకు వెళ్లి ప్రాథమిక పాఠశాల లను కాపాడేలా జనసేన పార్టీ ద్వారా పోరాడతామని తెలిపారు.

భీమిలి మండలంలోని మజ్జిపేట , తాటితురు , చిప్పాడ , పైలపేట , అవనం , మంగమారిపేట లలో ఉన్న ప్రాథమిక పాఠశాలలను హై స్కూల్ లో కలిపిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఆయా పాఠశాల ల ముందు నిరసన తెలిపి శుక్రవారం నాడు ఈ పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులతో కూడా కలిసి నిరసన తెలియజేస్తామని ఈ సమస్య పై జనసేన పార్టీ పోరాడతుందని తెలిపారు.

# మందులు ఎక్కువ వాడటం వల్ల లివర్ సమస్య

లివర్ మన శరీరంలో ముఖ్యమైన భాగం. ఆహారం జీర్ణం చేయడానికి లివర్ ప్రముఖ పాత్ర పోషిస్తుంది. ఫ్యాటీ యాసిడ్స్ జీర్ణం కావటానికి తోడ్పడుతుంది. ఆహారం జీర్ణం అయిన తర్వాత హార్మోన్, ఎంజైమ్, ప్రోటీన్, కొలస్ట్రాల్‌ను తిరిగి శరీరానికి అందిస్తుంది. శరీరానికి కావాల్సిన గ్లూకోజ్ నిల్వలను ఉంచుకుంటుంది. రక్తంలో గ్లూకోజ్ మితిమీరకుండా చూస్తుంది. ఐరన్, రాగి, విటమిన్ల వంటి వాటిని నిల్వ చేసుకుంటుంది. శరీరంలోని విషపదార్థాలను తొలగిస్తుంది. రోగనిరోధక శక్తి, జీవక్రియ, పోషకాల సరఫరా, నిల్వ చేయటంలో కాలేయం చాలా అవసరం. లివర్ నిరంతరం రక్తాన్ని ఫిల్టర్ చేస్తుంది, ముఖ్యమైన హార్మోన్లను, ఎంజైమ్‌లను తయారు చేస్తుంది. ఇది దాదాపు 500 రకాలకు పైగా క్రియలను నిర్వర్తిస్తుంది. లివర్‌ను ఆరోగ్యంగా ఉంచుకోవడం చాలా అవసరం. ఆల్కహాల్ ఎక్కువగా తాగితే.. లివర్ దెబ్బతింటుందని చాలా మందికి తెలుసు. కానీ, రోజూ మనం చేసే కొన్ని పనుల వల్ల లివర్ దెబ్బతినే ప్రమాదం ఉందని నిపుణులు చెబుతున్నారు.

లివర్ బలహీనంగా ఉంటే, మీ శరీరంలో కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. బలహీనత, ఆకలి లేకపోవడం, వాంతులు, నిద్రలేమి, రోజంతా అలసటగా అనిపించడం, నీరసం, వేగంగా బరువు తగ్గడం,కామెర్లు రావడం, రక్త వాంతులు, మల విసర్జన నల్లగా ఉండటం, బరువు తగ్గడం, కాళ్లు, కడుపులో నీరు చేరితే లివర్ సమస్య ఉందని గుర్తించాలి.

ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం, మన దేశంలో సంభవిస్తున్న మరణాలలో పదవ సాధారణ కారణం లివర్



సమస్యలు. ప్రతి సంవత్సరం దాదాపు పది లక్షల మంది భారతీయులు లివర్ సిర్రోసిస్‌తో బాధపడుతున్నారు. ప్రపంచంలో మరణాలకు ప్రధాన కారణాలలో ఇది కూడా ఒకటి.

**మందులు ఎక్కువ తీసుకుంటే..** ఓ అధ్యయనం ప్రకారం, ఎక్కువ మందులు తీసుకోవడం వల్ల లివర్ దెబ్బతింటుంది. ట్యాబ్లెట్స్, సప్లిమంట్స్.. మనం ఏది తీసుకున్నా లివర్ వాటిని లివర్ విచ్ఛిన్నం చేస్తుంది. కొన్ని మందులు చాలా కఠినంగా ఉంటాయి. వాటిని ఎక్కువగా తీసుకోవడం వల్ల కాలేయం దెబ్బతింటుంది. ప్రతీ చిన్న సమస్యకు ట్యాబ్లెట్స్ తీసుకుంటుంటే కాలేయ సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది.

**నీరు తక్కువగా తాగినా..** నీరు తక్కువగా తీసుకున్నా లివర్ సమస్యలు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. రోజుకు కనీసం 8 గ్లాసుల నీరు తాగాలని అంటున్నారు. లివర్ ఆరోగ్యంగా ఉండాలంటే.. తగినంత నీరు తాగడం చాలా అవసరం. లివర్ సమర్థవంతంగా పని చేయడానికి, నిల్వలు ఉంచుకోవడానికి నీరు చాలా అవసరం.

**హెవీ డిన్నర్..** రాత్రిపూట లివర్ ఎక్కువగా పని చేస్తుంది. రాత్రి భోజనం ఎక్కువగా తింటే.. లివర్‌పై అదనపు ఒత్తిడి ఏర్పడుతుంది. ఎక్కువ కాలం ఇదే పరిస్థితి ఉంటే.. లివర్ సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది. మీ రాత్రిపూట భోజనంలో నూనె ఎక్కువగా ఉండే ఆహారం తీసుకుంటే.. లివర్ సమస్యలు వచ్చే ప్రమాదం మరింత ఎక్కువవుతుంది. మీ లివర్‌ను రక్షించుకోవాలంటే.. సాయంత్రం పూట క్యారెట్, బీట్‌రూట్ తింటే మంచిది. ఇవి మీ లివర్‌ను శుభ్రపరుస్తాయి.

**స్మోకింగ్..** స్మోకింగ్ లివర్‌ను ఇన్‌డైరెక్ట్‌గా ప్రభావితం చేస్తుంది. సిగరెట్ పొగలో ఉండే, రసాయనాలు నెమ్మదిగా లివర్‌లోకి చేరతాయి. దీని వలన ఆక్సీకరణ ఒత్తిడి ఏర్పడుతుంది. లివర్ కణాలను దెబ్బతీసే ఫ్రీ రాడికల్స్‌ను ఉత్పత్తి అవుతాయి. స్మోకింగ్ వల్ల లివర్ క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంది.

**చక్కెర ఎక్కువగా తింటే..** చక్కెర ఎక్కువగా తింటే లివర్ సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది. బ్రెడ్, ఐస్ క్రీం, జ్యూస్, సోడా వంటి ఆహారాలలో ఫ్రక్టోజ్ ఎక్కువగా ఉంటుంది. మన శరీరంలో చాలా కణాలు గ్లూకోజ్‌ను జీవక్రియ చేయగలవు, ఫ్రక్టోజ్‌ను లివర్ సెల్స్ మాత్రమే విచ్ఛిన్న చేయగలవు. కాలక్రమేణా ఫ్రక్టోజ్ ఎక్కువగా తీసుకుంటే తీవ్రమైన లివర్ సమస్యలు వచ్చే అవకాశం ఉంది.

**అసురక్షిత కలయిక..** సురక్షితమైన సెక్స్‌లో పాల్గొనే వారి కంటే అసురక్షిత సెక్స్‌లో పాల్గొనేవారికి లివర్ దెబ్బతినే ప్రమాదం ఎక్కువ. దీని వల్ల హెపటైటిస్‌కు గురయ్యే అవకాశం ఉంది. హెపటైటిస్ సి అనేది లైంగికంగా సంక్రమించే ప్రాణాంతక కాలేయ వ్యాధి.

# షుగర్ కంట్రోల్‌లో లేకపోతే..




డయాబెటిస్ ఒకసారి వచ్చిందంటే.. దాన్ని అదుపులో ఉంచుకోవడం తప్ప, దానిని శాశ్వతంగా తగ్గించుకోలేం. లైఫ్‌లాంగ్ మందులు వేసుకుంటూనే ఉండాలి. డయాబెటీస్ ఉన్న వారికి రక్తంలో చక్కెర శాతం ఎక్కువగా ఉంటుంది. షుగర్ ఎక్కువ కాలం కంట్రోల్‌లో లేకపోతే.. కళ్ల నుంచి కాళ్ల దాకా ప్రతి అవయవాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉంది. రక్తంలో చక్కెర స్థాయిలు కంట్రోల్‌లో లేకపోతే.. దాని ప్రభావం అనేక అవయవాలపై పడుతుంది. రెటినోపతిలో చూపు మందగిస్తుంది. నెఫ్రోపతిలో కిడ్నీలు దెబ్బతింటాయి. న్యూరోపతిలో నరాలు దెబ్బతింటాయి. గుండెపోటు, బ్రెయిన్‌స్ట్రోక్ వచ్చే ప్రమాదం కూడా ఉంది. షుగర్ పేషెంట్స్ ఆహారం, అలవాట్లు, జీవనశైలిలో జాగ్రత్తగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

డయాబెటిస్ దుష్ప్రభావాలను నివారించడానికి ఆయుర్వేద వైద్యురాలు దీక్షా భావ్‌సర్ కొన్ని సూచనలు చేశారు. రక్తంలో చక్కెర స్థాయిలు కంట్రోల్‌లో లేకపోతే.. రక్తనాళాలు, గుండె, కిడ్నీలు దెబ్బతినే ప్రమాదం ఉందని అన్నారు.

**గుండె సమస్యలు..** మధుమేహం వల్ల గుండెలో తలెత్తే సమస్యను డయాబెటిక్ హార్ట్ డిసీజ్ అంటారు. దీని వల్ల గుండెలోని కండరాలు గట్టి పడటం లేదా బలహీనపడటం జరుగుతుంది. దీన్ని డయాబెటిక్ కాడియోమయోపతి అంటారు. డయాబెటిస్ పేషెంట్స్‌కు చిన్నవయసులోనే గుండె సమస్యలు వచ్చే అవకాశం ఉందని.డా. దీక్షా భావ్‌సర్ అన్నారు. డయాబెటిస్ మెల్లిటస్ ఉన్న రోగులలో గుండె వైఫల్యం (25% వరకు దీర్ఘకాలిక గుండె వైఫల్యం, 40% వరకు తీవ్రమైన గుండె వైఫల్యం) కేసులు ఎక్కువగా కనిపిస్తాయి. సాధారణ జనాభాలో కంటే డయాబెటిక్ రోగులలో ఈ సమస్య నాలుగు రెట్లు ఎక్కువగా ఉంటుంది.సాధారణ వ్యక్తుల్లో కంటే డయాబెటిక్ పేషెంట్స్‌కు గుండెపోటు వచ్చే అవకాశం అధికంగా ఉంటుంది.

కిడ్నీ సమస్యలకు డయాబెటిస్ ప్రధాన కారణమని ఆయుర్వేద వైద్యురాలు దీక్షా భావ్‌సర్ అన్నారు. షుగర్ సమస్య ఉన్న ముగ్గురిలో, ఒకరు కిడ్నీ సమస్యతో బాధపడుతున్నారు. డయాబెటిస్ స్టార్ట్ అయిన 10 నుంచి 15 సంవత్సరాల తర్వాత కిడ్నీలు దెబ్బతినే ప్రమాదం ఉంది. కిడ్నీలో రక్తాన్ని క్లియర్ చేయడంలో విఫలమవుతాయి. దీని వల్ల శరీరంలో విషపదార్థాలు పెరిగిపోతాయి.

**ఆహార విషయంలో జాగ్రత్త..** షుగర్ పేషెంట్స్ ఆహారం విషయంలో జాగ్రత్తలు పాటించాలని అన్నారు. ముఖ్యంగా ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలి. తీసుకునే ఆహారంలో ఫైబర్ ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. పాలు, పాల సంబంధిత పదార్థాలు, తీపి పదార్థాలు తీసుకోవడం వీలైనంత తగ్గించుకోవాలి. జంక్ ఫుడ్స్‌కు దూరంగా ఉండాలి. ఈ జాగ్రత్తలు పాటిస్తే గుండెకు సంబంధించిన సమస్యలను చాలావరకూ రాకుండా చూసుకోవచ్చు. వారానికి ఒకసారైనా.. దాల్చిన చెక్క వేసిన టీ, నీరు తాగండి. మీ ఆహారంలో ఉప్పు తగ్గించాలి. టీ, కాఫీలకు దూరంగా ఉండాలి.

**భోజనం ముందు, తర్వాత ఇవి తీసుకోండి..** షుగర్ పేషెంట్స్ భోజనానికి గంట ముందు లేదా భోజనానికి గంట తర్వాత.. 10-20 మిల్లీలీటర్ల ఆర్గానిక్ యాపిల్ సైడర్ వెనిగర్ తీసుకోవడం మంచిదని ఆయుర్వేద వైద్యురాలు దీక్షా భావ్‌సర్ అన్నారు. ప్రతి రోజూ ఖాళీ కడుపుతో టీస్పూన్ నానబెట్టిన మెంతులు తీసుకోవాలని సూచించారు. మెంతులతో టీ తయారు చేసుకుని కూడా తీసుకోవచ్చని అన్నారు.

**ప్రాణాయామం..** డయాబెటిక్ పేషెంట్స్ ప్రతీ రోజూ కనీసం 20 నిమిషాల పాటు ప్రాణాయామం చేయాలని సూచించారు. వారానికి కనీసం 6 గంటలు వ్యాయామం చేయడం వల్ల షుగర్ పేషెంట్స్ తీవ్రమైన వ్యాధులను నివారించవచ్చని అంటున్నారు. క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తూ.. బరువును అదుపులో ఉంచుకోవాలి.

ఆరోగ్యకరమైన జీవనశైలితో పాటు, రక్తంలోని చక్కెర స్థాయిలను కంట్రోల్‌లో ఉంచుకుంటే.. డయాబెటిస్ వల్ల వచ్చే తీవ్రమైన సమస్యలను నివారించవచ్చని అంటున్నారు.

# ఆస్తమా నుండి విముక్తి పొందండి



ప్రస్తుతం కలుషిత వాతావరణం కారణంగా చాలా మంది ప్రజలు ఆస్తమాతో బాధపడుతున్నారు. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ ఈ సమస్యతో బాధపడుతున్నారు. ఒక వ్యక్తి యొక్క శ్వాసనాళాలు ఉబ్బినప్పుడు మరియు చుట్టుపక్కల కండరాలు బిగుతుగా మారినప్పుడు దీర్ఘకాలిక ఆస్తమా సంభవిస్తుంది, దీని వలన శ్వాసనాళాలలో శ్లేష్మం పేరుకుపోతుంది మరియు గాలి సరిగ్గా ప్రవహించకుండా చేస్తుంది.

ఆస్తమా బాధితులు శ్వాస తీసుకోవడంలో చాలా ఇబ్బందులు పడుతున్నారు. దీని వల్ల శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, దగ్గు, ఛాతిలో నొప్పి వంటి అనేక సమస్యలు మొదలవుతాయి. ఈ సమస్య ఉన్నవారికి చికిత్స సమయంలో ఇన్హేలర్ ఉపయోగించబడుతుంది. అయితే, కొన్ని పండ్లు మరియు కూరగాయలు ఈ ఆస్తమా సమస్యను తగ్గించగలవు మరియు నియంత్రించగలవు. వీటిని క్రమం తప్పకుండా ఆహారంలో చేర్చుకుంటే ఆస్తమా లక్షణాలను తగ్గించుకోవచ్చు.

పాలకూర కూరగాయలలో, పాలకూరలో ప్రోటీన్, ఐరన్, విటమిన్లు, ఖనిజాలు, పొటాషియం, మెగ్నీషియం, విటమిన్ కె, ఫైబర్, ఫాస్పరస్, థయామిన్ మరియు విటమిన్ ఇ పుష్కలంగా ఉన్నాయి. ఈ పోషకాలన్నీ చర్మం, జుట్టు మరియు ఎముకల ఆరోగ్యానికి మేలు చేస్తాయి. ఇది ఆస్తమా లక్షణాలను తగ్గించడంలో కూడా సహాయపడుతుంది.

టమాటో రసం టొమాటోలో విటమిన్ సి, విటమిన్ బి మరియు పొటాషియం వంటి పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. అంతే కాకుండా ఇందులో లైకోపీన్ అనే యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇది గుండె జబ్బులు మరియు కొన్ని రకాల క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

క్యాప్సికమ్ వెజ్స్‌లో యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ సి మరియు ఫైటోన్యూట్రియెంట్లు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి శ్వాసకోశ సమస్యలతో బాధపడేవారు ఈ వెజ్స్ ను రెగ్యులర్‌గా ఆహారంలో చేర్చుకుంటే ఆస్తమా వంటి శ్వాసకోశ సమస్యలు తొలగిపోయి శ్వాసకోశ వ్యవస్థ ఆరోగ్యం మెరుగుపడుతుంది.

అల్లంలో యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. ఇది ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడుతుంది మరియు DNA దెబ్బతినకుండా చేస్తుంది. అలాగే అల్లం రక్తపోటు, గుండె జబ్బులు మరియు ఊపిరితిత్తుల వ్యాధి వంటి అనేక వ్యాధులతో పోరాడుతుంది మరియు శరీరానికి మంచి రక్షణను అందిస్తుంది.

ఆకుపచ్చ బటానీలు పచ్చి బఠానీలలో విటమిన్ ఎ, విటమిన్ సి, విటమిన్ కె, ఫోలిక్ యాసిడ్, కాల్షియం మరియు ఫైబర్ పుష్కలంగా ఉన్నాయి. ఇది ఎముకల బలం మరియు ఆరోగ్యానికి ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది మరియు పగుళ్ల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ముఖ్యంగా ఇందులోని బి విటమిన్లు డిప్రెషన్‌ని తగ్గించడంలో సహాయపడతాయి.

ఆపిల్ యాపిల్‌లో ఫైబర్ మరియు యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇది బరువు తగ్గడంలో సహాయపడుతుంది మరియు పేగు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. మధుమేహం, గుండె జబ్బులు మరియు క్యాన్సర్ వంటి అనేక దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని కూడా ఆపిల్ నిరోధించడంలో సహాయపడుతుంది.

అవకాడో అవోకాడోలో ఆరోగ్యకరమైన కొవ్వులు మరియు ఫైబర్, మెగ్నీషియం, విటమిన్ B6, C, విటమిన్ E మరియు ఫోలేట్ వంటి పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. ఇవి ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధులను నివారిస్తాయి.

నారింజ నారింజలో విటమిన్లు, ఖనిజాలు మరియు యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. ప్రధానంగా ఈ పండులో విటమిన్ సి, ఫోలేట్ పుష్కలంగా ఉంటాయి. ఇవన్నీ ఊపిరితిత్తుల వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి మరియు దాని ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి.

దానిమ్మ దానిమ్మలో ఫైబర్, విటమిన్ సి, విటమిన్ కె మరియు యాంటీఆక్సిడెంట్లు వంటి ముఖ్యమైన పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. ఇవి ఊపిరితిత్తులలోని కణాలకు నష్టం జరగకుండా చేస్తాయి. కాబట్టి శ్వాసకోశ వ్యాధులు ఉన్నవారు రోజూ దానిమ్మను జ్యూస్ రూపంలో లేదా మొత్తం పండులాగా తింటే మంచిది.

# వర్షాకాలంలో వీటిని తీసుకుంటే జలుబు, జ్వరం రావు



జలుబు.. మందులు వేస్తే 7 రోజుల్లో తగ్గేది.. వేయకపోతే వారం రోజులు ఉండేది. అంటే మందులు వేసినా, వేయకపోయినా ఈ సమస్య ఎప్పుడు తగ్గాలో అప్పుడే తగ్గుతుంది. వర్షాకాలం, చలికాలంలో ముఖ్యంగా వాతావరణం చల్లగా ఉన్న సమయంలో ఎక్కువగా వచ్చే ఈ సమస్య తెగ ఇబ్బంది పడుతుంది. దగ్గు, ఫీవర్, ఎప్పుడు తలంతా భారంగా బాబోయ్ చూడ్డానికి సమస్య చిన్నదే అయినా దుంప తెంచుతుందంటే నమ్మండి. ఇలాంటి జలుబుని కొన్ని జాగ్రత్తలు తీసుకుని తగ్గించుకోవచ్చు. ముఖ్యంగా ఆహారంలో కొన్ని చేర్చడం వల్ల జలుబు నుంచి త్వరగా ఉపశమనం లభిస్తుంది.

ఈ సమయంలో ఇమ్యూనిటీని పెంచేవే కాకుండా.. వేడిగా ఉన్న పదార్థాలను తినాలనిపిస్తోంది. వీటి వల్ల హాయిగా ఉంటుంది.

1 **సూప్...** సూప్ అనేది ఎంతో హాయిగా ఉంటుంది. ఈ టైమ్‌లో తీసుకోవడం. దీనిని తీసుకున్నప్పుడు గొంతు, ముక్కు ఉపశమనంగా మారుతుంది. ఇది త్వరగా జీర్ణమవుతుంది. అదే విధంగా, విటమిన్లు, ఖనిజాలకు గొప్ప మూలం. అందుకే వీటిని తాగుతుండొచ్చు. అయితే సూప్‌ని చాలా మంది రెస్టారెంట్‌కి చెందిన ఫుడ్ ఐటెమ్‌గానే చూస్తారు. కానీ, దీనిని ఇంట్లో కూడా చేసుకోవచ్చు. అందులో ముఖ్యంగా, అల్లం ముక్కలు, వెల్లుల్లి ముక్కలు వేస్తే త్వరగా ఉపశమనం అవుతుంది. ఇక ఇందులోనూ హాట్ అండ్ సోర్, గార్లిక్ సూప్, చికెన్ సూప్స్ వంటివి ట్రై చేయొచ్చు. అవి కూడా కాస్త పెప్పర్, మసాలాలు యాడ్ చేస్తే త్వరగా సమస్య తగ్గుతుంది. అయితే వీటిని ఎలా చేయాలో అన్న టెన్షన్ కూడా లేదండోయ్.. అన్నింటిని మనం ఏంచక్కా ఇంటర్నెట్‌లో సెర్చ్ చేసి ఫాలో అవ్వడమే.

2. **వెల్లుల్లి..** వెల్లుల్లి అనేది వంటల్లో రుచిని మాత్రమే కాదండి.. చక్కని ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉంటుంది. ఇందులోని ఔషధ గుణాలు చాలా ఆరోగ్య సమస్యల్ని దూరం చేస్తుంది. పోషకాహార నిపుణుల ప్రకారం ఇది ఇమ్యూనిటీని పెంచుతుంది. అదే విధంగా రెగ్యులర్‌గా దీనిని మీ ఆహారంలో భాగంగా చేసుకుంటే జలుబు, ఫ్లూ వంటి సమస్యల్ని దూరం చేసుకోవచ్చు.

3. **కొబ్బరి నీళ్ళు..** అదేంటి.. ఓ పక్క జలుబుతో బాధపడుతుంటే కొబ్బరి నీరు తాగమని చెబుతారనుకోకండి. జలుబు ఉన్న సమయంలో చాలా మంది డీ హైడ్రేట్ అవుతుంటారు. అందుకోసమే హైడ్రేషన్‌గా ఉండేందుకు కొబ్బరినీరు బాగా పనిచేస్తుంది. ఇందులోని ఎలక్ట్రోలైట్స్ మీకు మేలు చేస్తాయి. కాబట్టి కచ్చితంగా తీసుకోవాలి.

4. **అల్లం..** అల్లం కూడా కచ్చితంగా తీసుకోవాల్సిన ఫుడ్ ఐటెమ్స్‌లో ఒకటి. వీటిని తీసుకోవడం వల్ల ఎన్నో సమస్యలు దూరమవుతాయనడంలో ఆశ్చర్యం లేదు. వీటిని తినడం వల్ల ఆ ఘాటుకి జలుబు నుంచి చాలా వరకూ రిలీఫ్‌గా అనిపిస్తుంది. కూరల్లో వేసుకోవడం మధ్య మధ్యలో చిన్న అల్లం ముక్కని తీసుకోవడం, లేకపోతే అల్లం టీ చేసుకుని తాగడం వల్ల చాలా రిలీఫ్‌గా ఉంటుంది.

**ప్రోటీన్ ఫుడ్స్..** ప్రోటీన్ ఫుడ్స్ కూడా మీకు చాలా బాగా హెల్ప్ అవుతాయి. సాల్మన్ చేపలు, చికెన్, గుడ్లు, సీజనల్ ఫ్రూట్స్ తీసుకోవడం వల్ల చాలా వరకూ జలుబు తగ్గుతుంది. వీటితో పాటు బారతీయ సుగంధ ద్రవ్యాలు అంటే మసాలా వీటిని తగిన మోతాదులో తీసుకుంటే త్వరగానే జలుబు తగ్గిపోతుంది. అయితే ఏ పదార్థాలు కూడా ఎక్కువగా తీసుకోకూడదు. ఒక్కొక్కటిగా ఒక్కో సమయంలో తీసుకోవడం ఉత్తమం. అదే విధంగా ఆవిరిపట్టడం కూడా మంచి ఉపశమనాన్ని ఇస్తుంది.



వివిధ రకాల అనారోగ్య సమస్యలకు కారణం ఆహారపు అలవాట్లు, జీవనశైలి సరిగ్గా లేకపోవడమే. శరీరంలో కొలెస్ట్రాల్ పేరుకుపోయినా..రక్తపోటు అధికమైనా అన్నింటికీ ఇదే కారణం. అందుకే రోజూ ఈ డ్రింక్స్ సేవిస్తే..అన్ని సమస్యల్నించి పరిష్కారం లభిస్తుంది.

## చెడు కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉందా ?

ఆధునిక జీవనశైలి సరిగ్గా లేకపోవడం, చెడు ఆహారపు అలవాట్ల కారణంగా వివిధ రకాలైన అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటుంటాం. ముఖ్యంగా కొలెస్ట్రాల్, రక్తపోటు, చెడు కొవ్వు, హార్ట్ ఎటాక్ సమస్యలు తలెత్తుతుంటాయి. తినే తిండి సరిగ్గా లేకపోయినా లేదా ఒకేసారి ఎక్కువ మోతాదులో తిన్నా..పూర్తిగా జీర్ణం కాక...చెడు కొలెస్ట్రాల్ పేరుకుపోతుంది. ఫలితంగా అలసట, చెమటలు ఎక్కువగా పట్టడం వంటి సమస్యలు పెరుగుతాయి. కొలెస్ట్రాల్ ఎంత ప్రమాదకరమైందంటే.. సమయానికి నియంత్రించలేకపోతే హార్ట్ ఎటాక్, స్ట్రోక్ ముప్పు ఎదురౌతుంది. ఇతర అనారోగ్య సమస్యలు కూడా వెంటాడుతాయి. అందుకే ఈ సమస్య నుంచి విముక్తి పొందేందుకు సహజసిద్ధమైన కొన్ని హెూమ్ డ్రింక్స్ తప్పని సరి.

స్థూలకాయం కారణంగా వివిధ రకాల సమస్యలు ఎదురవుతుంటాయి. అందుకే మంచి డైట్‌తోపాటు రోజూ ఆనపకాయ జ్యూస్ తప్పకుండా తాగాలి. ఇందులో పుష్కలంగా ఫైబర్ ఉండటమే కాకుండా..98 శాతం నీరు ఉండటం వల్ల..అనవసరమైన వ్యర్థ కొవ్వు వేగంగా కరిగిపోతుంది. ఫలితంగా మీ గుండె ఆరోగ్యంగా ఉంటుంది.

ఇక రెండవది కాకరకాయ జ్యూస్. చాలామంది చేదుగా ఉంటుందనే కారణంతో ఇష్టపడరు. కానీ కాకరకాయలో విటమిన్లు, మెగ్నీషియం, ప్రోటీన్లు, ఫైబర్, ఐరన్ పుష్కలంగా ఉంటాయి. ఒకేసారి ఎక్కువ తినడం వల్ల మీ శరీరం జీర్ణం చేసుకోలేదు. ఫలితంగా జీర్ణం కాకుండా మిగిలింది కొలెస్ట్రాల్‌గా మారుతుంది. ఈ కొలెస్ట్రాల్ కరిగించేందుకు రోజూ కాకరకాయ జ్యూస్ మంచి ఔషధం.

ఇక మూడవది టొమాటో జ్యూస్. సాధారణంగా ఎక్కువమంది టొమాటోను సలాడ్ రూపంలో తీసుకుంటారు. కానీ ప్రతిరోజూ ఉదయం టొమాటో జ్యూస్ తాగితే మంచి ఫలితాలుంటాయి. కొలెస్ట్రాల్ తగ్గించేందుకు టొమాటో జ్యూస్ అద్భుతంగా పనిచేస్తుంది. ఇందులో పుష్కలంగా లభించే ఫైబర్..శరీరంలో ఎల్‌డీఎల్ అంటే బ్యాడ్ కొలెస్ట్రాల్ కరిగించడంలో సహాయపడుతుంది. ఇందులో ఉన్న నియాసిన్, విటమిన్ బి3లు శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిని పెరగనివ్వవు.

## వర్షాకాలంలో ఐస్‌క్రీమ్స్ తినవచ్చా



ఐస్‌క్రీమ్ ఇంచుమించు అందరికీ ఇష్టమైంది. వేసవిలో అందరూ తింటారు. కానీ కొంతమంది వర్షాకాలంలో సైతం అత్యంత ఇష్టంగా ఐస్‌క్రీమ్ లాగిస్తుంటారు. అయితే వర్షాకాలంలో ఐస్‌క్రీమ్ తినడం ఆరోగ్యానికి ఎంతవరకూ మంచిది..

కొన్ని పదార్థాలు సీజన్‌ను బట్టి తినాలి. ముఖ్యంగా వేసవి కాలంలో అందరూ ఇష్టంగా తినే ఐస్‌క్రీమ్..వర్షాకాలంలో ఎంతమాత్రం తినకూడదు. వర్షాకాలంలో ఐస్‌క్రీమ్స్ తినడం వల్ల ఆరోగ్యానికి హాని కలుగుతుంది. మీకు కూడా అటువంటి అలవాటుంటే వెంటనే మానుకోండి. వాస్తవానికి ఐస్‌క్రీమ్ వల్ల ముందుగా ఇబ్బంది ఏర్పడేది గొంతుకే. ఇది వేసవిలో కూడా ఉంటుంది కానీ..వర్షాకాలంలో ఇంకాస్త ఎక్కువగా ఉంటుంది.

వర్షాకాలంలో వాతావరణం చల్లగా ఉంటుంది. ఈ సీజన్‌లో ఐస్‌క్రీమ్స్ తినడం వల్ల జలుపు, దగ్గు, ఛాతీలో పట్టినట్టుండటం వంటి సమస్యలు తలెత్తుతాయి. వర్షాకాలంలో స్వీట్స్ తినాలనే కోరిక ఉంటే..ఐస్‌క్రీమ్‌కు బదులు హల్వా తింటే మంచిది. సాధ్యమైనంతవరకూ ఐస్‌క్రీమ్స్‌ను దూరంగా పెట్టాలి ఈ సీజన్‌లో. ఐస్‌క్రీమ్స్ తినడం వల్ల ఎదురయ్యే మరో సమస్య తలనొప్పి. వర్షకాలంలో చల్లటినీళ్లు లేదా ఐస్‌క్రీమ్స్ తీసుకోవడం వల్ల మెదడు ఫ్రీజ్ అవుతుంది. మస్తిష్కంలోని నాళాలపై ప్రభావం చూపిస్తుంది. ఫలితంగా తలనొప్పి వంటి సమస్యలు ఎదురౌతాయి. ముఖ్యంగా సైనస్ సమస్యతో ఇబ్బందిపడేవాళ్లు పూర్తిగా ఐస్‌క్రీమ్ దూరంగా పెట్టాల్సిందే.

# ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించాలి



ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ కొరకు జీవో నెంబర్ 117 లోని అసంగతాలను తొలగించాలని, మూడు నాలుగు ఐదు తరగతులను ఉన్నత పాఠశాలలో విలీనాన్ని రద్దు చేయాలని, అన్ని పాఠశాలలలో తెలుగు ఆంగ్ల మాధ్యమాలు కొనసాగించాలని ఏపీటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పల భానుమూర్తి డిమాండ్ చేశారు. వందరోజుల ఉపాధ్యాయుల ఉద్యమంలో భాగంగా ఈరోజు శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ప్రారంభమైన ధర్నా శిబిరాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. . సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, 3, 4, 5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసే ప్రక్రియను నిలిపివేయాలనీ ఏపీటీఎఫ్ శ్రీకాకుళం జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి బల్ల సుభాష్ బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ, పంచాయితీరాజ్, మునిసిపల్, గురుకుల పాఠశాలలలో తెలుగు, ఆంగ్లమాధ్యమాలను రెండింటినీ కొనసాగించాలనీ,11వ పి.ఆర్.సిలో ఫిట్మెంట్ను 27%కి తగ్గకుండా మంజూరు చేయాలనీ, ఏపీటిఎస్ శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి చావలి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులన్నింటినీ భర్తీ చేయాలనీ, కరోనాతో మృతి చెందిన ఉపాధ్యాయుల కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలు ఇవ్వాలనీ, ప్రావిడెంట్ ఫండ్, ఏ.పి.జి.ఎల్.ఐ. డి.ఎ బకాయిలు, సంపాదిత సెలవు, మెడికల్ రీయింబర్స్మెంట్, గత కాలపు ఎరియర్లు మొదలైన వాటిని వెంటనే చెల్లించాలనీ,మునిసిపల్ ఉపాధ్యాయులకు పి.ఎఫ్ సౌకర్యం కల్పించాలనీ. ప్రధానోపాధ్యాయులకు,డి.డి.ఓ అధికారాలను ఇవ్వాలి. ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టాలనీ ఐ.టి.డి.ఎ పండిట్ పోస్టులను అప్ గ్రేడ్ చేయాలనీ. ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టాలనీ, జిల్లా కార్యదర్శి దాసరి రామ్మోహనరావు పేర్కొన్నారు. గురుకుల సొసైటీలు, మోడల్ స్కూల్స్, కె.జి.బి.విలలో అవుట్ సోర్సింగ్ కాంట్రాక్టు విధానాలను రద్దుచేయాలనీ. అన్ని సొసైటీలను విద్యాశాఖలో విలీనం చేయాలనీ. ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ కు జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ లో సభ్యత్వాన్ని ఇవ్వాలనీ డిమాండ్ చేస్తూ శ్రీకాకుళం జిల్లా శాఖ ఉపాధ్యక్షులు టి భీమారావు పేర్కొన్నారు.. ఈ డిమాండ్లపై జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ఈ రోజు ప్రారంభం రోజు ప్రారంభమైన ధర్నా 27వ తేదీ వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు.. వారం రోజులపాటు జరిగే ఈ ధర్నాలో జిల్లాలోని ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ప్రకటనలో కోరారు. ఈరోజు కార్యక్రమంలో ఏపీటీఎఫ్ సీనియర్ నాయకులు బి సింహాచలం, బి జగన్నాథరావు, పేడాడ అప్పలనాయుడు, టీవీఎస్ నారాయణ, రామన్నాయుడు పెద్ద సంఖ్యాలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు. జోరున వర్షం పడుతున్నప్పటికీ ధర్నా కొనసాగించడం విశేషం.

# పార్వతీపురం రైస్ మిల్ కార్మికులకు నూతన వేతన ఒప్పందం చేయాలి



**పార్వతీపురం, మన్యం, (విశాఖ సమాచారమ్):** పార్వతీపురం ఏరియాలోని రైస్ మిల్ కళాసీలకు మూడు సంవత్సరాలకు ఒకసారి అగ్రిమెంట్ జరగాలి ఈ అగ్రిమెంటు ఈ జూన్ 6తేదితో ముగిసింది. పెరిగిన ధరలు, కార్మికుల జీవన, ఆరోగ్య పరిస్థితిని మెరుగు చేసుకోవడానికి ఇప్పుడు ఇస్తున్న కూలి రేట్ల పై రూపాయికి రూపాయి పెంచాలని, వేతన ఒప్పందం రెండు సంవత్సరములకు మార్చాలని కార్మికులకు పిఎఫ్, గ్రాడ్యుటీ,ఈ.ఎస్.ఐ సౌకర్యం కల్పించే కొత్త వేతన ఒప్పందం జరపాలని యజమానులకు నెల రోజుల ముందు మే 11వ తేదీన డిమాండ్లు నోటీసు ఇచ్చాం.

యజమానులు ఏమీ పెంచలేమని ఏక పక్షంగా తెలిపారు. చర్చలు ఏర్పాటు చేయాలని జూన్ 26న జరిగిన కార్మికుల జనరల్ బాడీ డిమాండ్ చేయగా జూలై ఏడవ తేదీన యజమానులు చర్చలకు పిలిచి పాత ఒప్పందానికి అంగీకరించాలని, వయసు పెరిగే సీనియర్ కార్మికులని గ్రాడ్యుటీ, నష్ట పరిహారం లేకుండా తొలగిస్తామని తెలిపారు. ఇది చట్టవిరుద్ధమని సంఘం తెలపగా చట్ట ప్రకారంగా అన్ని అమలు చేస్తామని వారం రోజుల్లో రాసిస్తామని చర్చలు ఏర్పాటు చేస్తామని యజమానులు తెలిపారు. ఇంతవరకు స్పందించలేదు. వెంటనే లేబర్ అధికారులు, జిల్లా అధికారులు కలుగజేసుకొని కొత్త ఒప్పందం చేయించాలని కోరుతూ. యూనియన్ కమిటీ తీర్మానం ప్రకారం అసిస్టెంట్ లేబర్ అధికారికి సబ్ కలెక్టర్ గారికి, కలెక్టర్ గారికి యూనియన్ మరియు సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి. కృష్ణ, పి. లక్ష్మణరావు, సిహెచ్ .శంకర్రావు, గొర్లె. వెంకటరమణ, రెడ్డి వేణు వినతి పత్రం అందజేశారు లేబర్ అధికారులు వెంటనే జాయింట్ మీటింగు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు లేనిచో ఆందోళన పోరాటం తీవ్రతరం చేస్తారని తెలిపారు.

# తోటపల్లి జలాశయం కుడి, ఎడమ కాలువల ద్వారా సాగునీరు విడుదల



**పార్వతీపురం మన్యం, (విశాఖ సమాచారమ్):** పార్వతీపురం మన్యం జిల్లాలో గల ప్రధాన మైనటువంటి తోటపల్లి జలాశయం కుడి ఎడమ రెండు కాలువల ద్వారా దాదాపు రెండు లక్షల ఎకరాలకు సాగునీరు నేడు విడుదల చేసే కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొరతో పాటుగా కార్యక్రమంలో జిల్లా జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు గ, ఎమ్మెల్యేలు శ్రీమతి పాముల పుష్పశ్రీవాణి, అలజంగి జోగారావు, శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, శ్రీమతి కళావతి, ఎమ్మెల్యే ఇందుకూరి రాఘురాజు, పాలవలస విక్రాంత్ పాల్గొనడం జరిగినది.కార్యక్రమంలో ముందుగా తోటపల్లి కుడి కాలువ ద్వారా గేట్లు ఎత్తి సుమారుగా లక్ష ముప్పై ఐదు ఎకరాలకు సాగు నీరు విడుదల చేయగా అనంతరం ఎడమ కాలువ గేట్లు ఎత్తి తద్వారా అరవై నాలుగు ఎకరాల పంట పొలాలకు సాగునీరు విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా ప్రతినిధులు వైస్ జెడ్పీ చైర్మన్, వివిధ మండలాల జెడ్పీటీసీలు, ఎంపీపీ లు, నీటి పారుదల శాఖ అధికారులు, వైసీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజల మనిషి వీటి జనార్ధన్ తాట్రాజ్



**పార్వతీపురం మన్యం, (విశాఖ సమాచారమ్):** కురుపాం నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు పేద ప్రజల మనిషి ఆత్మ బంధువు నియోజకవర్గ ప్రజలలో మంచి మనిషిగా నిలిచి పోయిన వ్యక్తి స్వర్గీయ వీటి జనార్ధన్ తాట్రాజ్ అని మాజీ మంత్రి ఎమ్మెల్సీ శత్రుచర్ల విజయరామరాజు కొనియాడారు గురువారం నాడు మండలంలో గల అల్లు వాడ గ్రామంలో ఏర్పాటు చేసిన జనార్ధన్ తాట్రాజ్ విగ్రహాన్ని శత్రుచర్ల ఆవిష్కరించారు జనార్ధన్ తాట్రాజు వర్ధంతి సందర్భంగా పలు కార్యక్రమాలు జిఎంవలస మండలంలో జరిగాయి ఈ సందర్భంగా శత్రుచర్ల మాట్లాడుతూ జనార్ధన్ తాట్రాజ్ నియోజకవర్గం లో చేసిన అభివృద్ధి పనులు నిరుపేదలకు అందించిన సంక్షేమ పథకాలు చిరస్థాయిగా నిలిచిపోయాయి అన్నారు అనంతరం చిన్న మేరంగి 30 పడకల ఆసుపత్రిలో వీటి జనార్ధన్ తాట్రాజు సతీమణి రమాజ్యోతి రోగులకు పళ్ళు రొట్టెలు పంపిణీ చేశారు విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో మండలంలో గల పలువురు సర్పంచ్ లు ఎంపిటీసీలు మాజీ సర్పంచులు ఎంపిటీసీలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# ఇంద్ర ధనస్సులా మెరిసిపోతున్న ఈ గ్రహం ఏదో తెలుసా..?



పైన చిత్రంలో ఇంద్ర ధనస్సులా మెరిసిపోతున్నది మన సౌర కుటుంబంలో చివరన ఉన్న ప్లూటో గ్రహం. మొదట్లో సౌర కుటుంబంలోని 9 గ్రహాల్లో ఒకటిగా ఉన్న దీనిని కొన్నేళ్ల కింద ఆ హోదా నుంచి తొలగించారు. ప్రస్తుతం ప్లూటోను మరుగుజ్జు గ్రహంగానే పిలుస్తున్నారు. దీనికి సంబంధించి అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసా తాజాగా ఇన్ స్టాగ్రామ్ లో ఈ చిత్రాన్ని పెట్టింది. దానితోపాటు ప్లూటో విశేషాలనూ పేర్కొంది.

**న్యూహారిజాన్స్ తీసిన చిత్రం**

అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసా గతంలో ప్రయోగించిన న్యూహారిజాన్స్ వ్యోమ నౌక ప్లూటోను దగ్గరి నుంచి స్పష్టంగా చిత్రించింది. ప్లూటోపై ఉన్న వివిధ ప్రాంతాలు, లోయలు, పర్వతాలు, నున్నగా మంచుతో కూడిన మైదాన ప్రాంతాలను స్పష్టంగా ఫొటోలు తీసింది. ఆ వివరాలు మరింత స్పష్టంగా కనిపించేలా నాసా శాస్త్రవేత్తలు.. న్యూహారిజాన్స్ తీసిన చిత్రాన్ని రంగుల్లోకి మార్చారు.

సౌర కుటుంబంలో అల్లంత దూరాన ఉన్న గ్రహాలు, గ్రహ శకలాలను పరిశీలించేందుకు నాసా 2006లో న్యూహారిజాన్స్ వ్యోమనౌకను ప్రయోగించింది.

అది వివిధ గ్రహాలను పరిశీలిస్తూ.. 2015లో ప్లూటోకు దగ్గరగా చేరింది. సుమారు ఆరు నెలల పాటు ప్లూటోకు సమీపంగా ప్రయాణించిన న్యూహారిజాన్స్.. ఆ మరుగుజ్జు గ్రహానికి సంబంధించిన ఎన్నోచిత్రాలను మనకు అందించింది.

ఇన్ స్టాగ్రామ్ లో నాసా పెట్టిన ఈ ఫొటో, పోస్టుకు కేవలం ఒక రోజులోనే దాదాపు పది లక్షల దాకా లైక్ లు, వేలల్లో కామెంట్లు రావడం గమనార్హం.

# మోసపోయిన రైతుకు ధాన్యం డబ్బులు ఇప్పించిన ఎంపీపీ బొంగు సురేష్



**పార్వతీపురం మన్యం, (విశాఖ సమాచారమ్):** జియ్యమ్మవలస మండల కేంద్రంలో గల రైతు లచ్చిపతుల శ్రీనివాసరావు పండించిన ధాన్యం అమ్మేటప్పుడు డబ్బులు పడేటప్పుడు మోసపోయాడు తరువాత గ్రహించిన శ్రీనివాసరావు స్థానిక పోలీసులకు ఎంపీపీ బొంగు సురేష్ కు ఎంపీటీసీ శంకర్రావుకు సొసైటీ ప్రెసిడెంట్ ఆర్నెపల్లి వెంకట్ నాయుడు కు ఫిర్యాదు చేశాడు ఫిర్యాదు చేసిన వెంటనే సీఐ తిరుపతిరావు జిఎంవలస ఎస్సై అనిస్ కుమార్ వెంటనే విచారణ జరిపారు ధాన్యం డబ్బులు 1,38 వేల రూపాయలు శ్రీనివాసరావుకు ఇప్పించారు ఎంపీపీ బొంగు సురేష్ పోలీసులకు స్థానిక ప్రజాప్రతినిధులకు అభినందించారు.

# జూలై 22 నుంచి ఇగ్నో పరీక్షలు ప్రారంభం

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) జూన్ 2022 లో నిర్వహించాల్సిన వార్షిక పరీక్షలని ఈ నెల 22 వ తారీఖు నుంచి జరపడానికి ఏర్పాట్లు చేసింది. ఈ పరీక్షల కోసం దేశ వ్యాప్తంగా 831 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు వాటిలో 82 పరీక్షా కేంద్రాలు దేశంలోని వివిధ జైళ్లలో ఏర్పాటు చేశారు. దేశ వ్యాప్తంగా సుమారు 770000 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం పరిధిలో 11 జిల్లాలో 7 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ 7 కేంద్రాలలో సుమారు 3500 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. వీరందరికీ హాల్ టికెట్లు విశ్వవిద్యాలయం వెబ్ సైట్ లో అందుబాటులో ఉంచారు. అర్హత కలిగిన విద్యార్థులు విశ్వవిద్యాలయం వెబ్ సైట్ లోకి వెళ్లి తమ హాల్ టికెట్లను డౌన్లోడ్ చేసుకోవాలని దానితో పాటు తమ గుర్తింపు కార్డులతో పరీక్షలకు హాజరు కావాలని ప్రాంతీయ కేంద్ర సంచాలకులు డా. జి. ధర్మారావు కోరారు. హాల్ టికెట్లను పొందడంలో ఇబ్బందులు ఎదురైతే వారు సరాసరి పరీక్షా కేంద్రాల వద్ద ఉన్న లిస్టు లలో తమ పేరు సరి చూసుకొని పరీక్షకు హాజరయ్యే అవకాశం ఉంది. ఈ పరీక్షలు జరిగే నెల రోజుల్లో పరీక్షా కేంద్రాల వద్ద భారత ప్రభుత్వం నిర్దేశించిన విధంగా కోవిడ్ పరిరక్షణ చర్యలు ముఖ్యంగా సామాజిక దూరం పాటించడం, పరిశుభ్రతకు ముప్పు వాటిల్లకుండా తగిన చర్యలు చేపడతారు. మొబైల్ ఫోన్స్ వంటి సాంకేతిక ఉపకరణాలు పరీక్షా కేంద్రాలలోకి అనుమతించబడవు. ఇగ్నో జారి చేసిన గుర్తింపు కార్డు తప్పని సరిగా తీసుకు రావాలి.

# పారిశుద్ధ్య పనులపై మేయర్ అసంతృప్తి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** 27వ వార్డులో పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించనందున నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి శానిటరీ ఇన్స్పెక్టర్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఆమె క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా మూడవ జోన్ 27 వ వార్డులో శ్రీనగర్, రామా టాకీస్ రోడ్డు, ద్వారకా నగర్ తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యులు వాసుపల్లి గణేష్ కుమార్, స్థానిక కార్పొరేటర్ గొలగాని వీరారావుతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ పారిశుద్ధ్య పనులు పై ఎటువంటి అలసత్వం ప్రదర్శించరాదని శానిటరీ ఇన్స్పెక్టర్ ను మందలించారు. వార్డులో చెత్త ఎక్కడబడితే అక్కడ కనిపిస్తోందని కాలువలలో పూడికలు తీయుటలేదని, వెంటనే పారిశుద్ధ కార్మికులుచే శుభ్రం చేయించాలని అధికారులను ఆదేశించారు. శానిటరీ కార్యదర్శులు ఉదయం 6 గంటల నుండి విధులు నిర్వహించి పారిశుద్ధ్య పనులు పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రధాన రోడ్లను కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసి చెత్తను డంపింగ్ యార్డుకు తరలించాలని, ప్రతి ఇంటి నుండి చెత్త సేకరణ పక్కాగా జరగాలని అధికారులను ఆదేశించారు. వర్షాలు పడుతుందన్న సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున, వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని డెంగ్యూ, మలేరియా వ్యాధులు రాకుండా తీసుకునే చర్యలను ప్రజలకు వివరించాలని అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ శివప్రసాద్, అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సునీల్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ వెంకటేశ్వరరావు, సూపర్డెంట్ ఇంజనీర్ సత్యనారాయణ రాజు, శానిటరీ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

# పట్టణంలో అత్యంత వైభవంగా బోనాల ఉత్సవం





**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** అనకాపల్లి గవరపాలెంలో గురువారం అత్యంత వైభవంగా బోనాల ఊరేగింపు కార్యక్రమం జరిగింది. శ్రీ గౌరీ పంచాయతన దేవాలయం ఆధ్వర్యంలో జరిగిన బోనాల ఉత్సవంలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని బోనాలను తలపై పెట్టుకుని శ్రీ గౌరీ పంచాయ తన దేవాలయం నుండి శ్రీ నూకంబిక అమ్మవారి ఆలయం వరకు పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ శాసనసభ్యుడు పీలా గోవింద సత్యనారాయణ, శ్రీ వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ కాండ్రేగుల విష్ణుమూర్తి, ప్రముఖ వర్తకులు మల్ల సాంబశివరావు, విశాఖశ్రీ గౌరీ సేవా సంఘం పూర్వపు అధ్యక్షుడు బుద్ధ శివాజీ, హాజరయ్యారు. ఈ బోనాల కార్యక్రమంలో గీతా మహిళ మండలి .శ్రీ గౌరీ అమృతవర్షిని. శ్రీ సత్తెమ్మ తల్లి దేవస్థానం మహిళా మండలి. శ్రీ పాద సేవ సమితి పట్టణ మహిళా సంఘాలు కోలాటాలతో, ఊరేగింపుకు అగ్రభాగాన నిలిచాయి. పోతరాజుల నృత్యాలు ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి. శ్రీ గౌరీ సేవా సంఘం నుండి ప్రారంభమైన బోనాల ఊరేగింపు పరమేశ్వరి పార్క్ సెంటర్ సత కంపట్టు, చినరామస్వామి కోవెల ,పెదరామస్వామి కోవెల, సంతబయల మీదుగా శ్రీ నూకాంబికా అమ్మవారి ఆలయానికి చేరుకుంది. అక్కడ మహిళలు నూకాంబిక అమ్మవారిని దర్శించుకుని అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ బేడా మండపంలో తెలంగాణ కల్చరల్ అసోసియేషన్ సభ్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన కూచిపూడి నృత్య రీతులు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో గౌరీ సంఘం అధ్యక్షులు బొడ్డేడ సన్యాసినాయుడు ,కార్యదర్శి బుద్ధ రమణా జీ ,కోశాధికారి కర్రీ శివ సూర్యనారాయణ, పెంటకోట ఉమామహేశ్వర రావు,పెంట కోట బాలకృష్ణ , తెలుగుదేశం పార్టీ నాయకులు మల్ల సురేంద్ర, కొణతాలరత్నకుమారి తెలంగాణ గౌరీ సేవా సంఘం సభ్యులు, కర్రీ కిషోర్ తదితరులు పాల్గొన్నారు. ఈ బోనాల ఊరేగింపు సందర్భంగా శ్రీ నూకంబికమ్మ వారి ఆలయంలో వెయ్యి మంది భక్తులకు ఆలయ కార్యనిర్వహణ అధికారి బుద్ధ లక్ష్మి నగేష్ ఆధ్వర్యంలో అమ్మవారి ప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది

# చింతూరు ప్రాంతీయ ఆసుపత్రి సందర్శించిన స్టేట్ ప్రోగ్రాం ఆఫీసర్లు



**పాడేరు/చింతూరు, (విశాఖ సమాచారమ్):** జిల్లాలో వరదల నేపథ్యంలో చింతూరు, ఎటపాక, వి ఆర్ పురం, కూనవరం మొదలగు నాలుగు మండలాలు ముంపునకు గురయ్యాయి. ఆయా మండలాల్లో ప్రత్యేక వైద్య సేవలు అందించేందుకు ఇతర జిల్లాల నుంచి డాక్టర్లను, వైద్య ఆరోగ్య శాఖ ప్రధాన కేంద్రం నుండి ఇద్దరు స్టేట్ ప్రొగ్రాం అధికారులను కేటాయిస్తూ ఆ శాఖ ఉత్తర్వులు జారీ చేసిన విషయం విదితమే.

గత నాలుగు రోజులుగా వరద ప్రభావిత ప్రాంతాల్లో వైద్య సేవలు అందిస్తున్న స్టేట్ ప్రొగ్రాం అధికారులు డా. నిర్మల గ్లోరి, డా. శిరీష గురువారం చింతూరు ప్రాంతీయ ఆసుపత్రిని సందర్శించి అక్కడ రక్తం అవసరం ఉన్న రోగులను గుర్తించి వారికి ఆరు యూనిట్ల రక్తాన్ని మార్పిడి చేశారు.

# ఉచిత హోమియో శిబిరానికి విశేష స్పందన




**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** స్థానిక గవరపాలెం శంకర్ థియేటర్ వద్ద బుధవారం విల్లూరి సత్యనారాయణ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు మురళి శ్రీమాన్ రాజేష్ ఏర్పాటు చేసిన ఉచిత హోమియో శిబిరానికి విశేష స్పందన లభించింది. చదరం భాస్కరరావు జ్యోతి ప్రజలను చేసి ప్రారంభించారని విల్లూరి వరలక్ష్మి తెలిపారు. సోదర సంక్షేమ సంఘం సభ్యులైన డాక్టర్ మల్ల హేమంత్ వివేక పర్యవేక్షణ లో అనకాపల్లి , శంకరం, కొప్పాక, గోలగాం,గ్రామాల నుండి సుమారు 200 మంది రోగులు హాజరై వారి సమస్యలను డాక్టర్ కి వివరించి ఆరోగ్య సలహాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాండ్రేగుల వెంకటరమణ కొణతాల పూర్ణచంద్రరావు కాండ్రేగుల శివ పీలా త్రినాధ్ విల్లూరి చిన్న మల్ల సత్యవతి మల్ల గణేశ్వరరావు దాడి బుజ్జి భీమరశెట్టి తిరుమల తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచంలో శక్తివంతమైన పాస్పోర్టుల జాబితా



ప్రపంచంలో శక్తివంతమైన పాస్పోర్టుల జాబితాలో భారత్ 87వ స్థానంలో నిలిచింది. హెన్లే అండ్ పార్ట్నర్స్ అనే ఇమ్మిగ్రేషన్ కన్సల్టెన్సీ 2022కు సంబంధించి ఈ ర్యాంకులు విడుదల చేసింది. ఈ సంస్థ గతేడాది విడుదల చేసిన ర్యాంకింగ్స్లో 90వ స్థానంలో ఉన్న భారత్ ఈసారి దానిని మెరుగుపర్చుకుని 87వ స్థానంలో నిలవడం విశేషం.

కాగా ప్రపంచంలో సుమారు 202 దేశాలుంటే భారత పౌరులకు ప్రపంచవ్యాప్తంగా 60 దేశాలు వీసా లేకుండానే సుస్వాగతం పలుకుతున్నాయి. దీంతో ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన పాస్పోర్టుల్లో భారత్ పాస్పోర్టుకు 87వ ర్యాంకు దక్కింది.

కాగా ప్రపంచంలోనే శక్తివంతమైన పాస్పోర్టు కలిగిన దేశంగా జపాన్ తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది. వరుసగా ఐదోసారి జపాన్ ఫస్ట్ ర్యాంకు సాధించడం విశేషం. జపాన్ పాస్పోర్టు ఉన్నవారు ఏకంగా 193 దేశాలకు సులువుగా వెళ్లవచ్చు. ఇక సింగపూర్. దక్షిణ కొరియా పాస్పోర్టులు ఉమ్మడిగా రెండో స్థానంలో నిలిచాయి. ఈ రెండు దేశాల పౌరులు 192 దేశాలకు స్వేచ్ఛగా వెళ్లవచ్చు.

జర్మనీ స్పెయిన్ పాస్పోర్టులు ఉమ్మడిగా మూడో ర్యాంకు సాధించాయి. జర్మనీ స్పెయిన్ పాస్పోర్టులు ఉన్నవారు 190 దేశాల్లోకి సులువుగా వెళ్లవచ్చు. ఫిన్లాండ్ ఇటలీ లగ్జెంబర్గ్ ఉమ్మడిగా నాలుగో స్థానంలో నిలిచాయి. ఈ రెండు దేశాల పాస్పోర్టులు ఉన్నవారు 189 దేశాలకు సులువుగా వెళ్లవచ్చు. ఇక ఐదో స్థానంలో ఆస్ట్రియా డెన్మార్క్ నిలిచాయి. ఈ రెండు దేశాల పాస్పోర్టులు ఉన్నవారు 188 దేశాలకు వెళ్లే అవకాశం ఉంది. ఇక యునైటెడ్ కింగ్డమ్ (యూకే) అమెరికా పాస్పోర్టులు వరుసగా ఆరు ఏడు ర్యాంకులు సాధించాయి. యూకే పాస్పోర్టుతో 187 దేశాలకు యూఎస్ పాస్పోర్టుతో 186 దేశాలకు వెళ్లొచ్చు. యూఏఈ (యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్) పాస్పోర్టు 15వ స్థానంలో ఉంది.

చైనా పాస్పోర్టు 69వ స్థానంలో నిలిచింది. చైనా పాస్పోర్టుతో 80 దేశాలకు సులువుగా వెళ్లొచ్చు. అదేవిధంగా రష్యా పాస్పోర్టుకు 50వ ర్యాంకు దక్కింది. ఆఫ్ఘనిస్తాన్ పాస్ పోర్టు చివరి స్థానంలో నిలిచింది. ఈ దేశ పాస్పోర్టుతో 27 దేశాలకు మాత్రమే వెళ్లే అవకాశం ఉంది.

# మాకొద్దీ ఏపీ పాలన అంటున్నారు!



పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి ప్రస్తుతం ఇరు తెలుగు రాష్ట్రాల్లో వివాదం రేగుతోంది. దీంతో నువ్వెంత అంటే నువ్వెంత అన్నంత వరకూ తగువు వెళ్తోంది. మొదట రాజకీయం దీనిని రాజకీయం చేయవద్దని తెలంగాణ మంత్రి పువ్వాడ అజయ్ వేడుకుంటున్నారు.

తన మాటలను అర్థం చేసుకోవాలని కోరుతున్నారు. తాజాగా ఉన్న సమాచారం ప్రకారం పోలవరం పరిధిలో ఉన్న ఐదు ఊళ్లనూ తెలంగాణలోనే విలీనం చేయాలని తాము ఆంధ్రాలో ఉండబోమని ఆదివాసీలు చెబుతున్నారు. ఈ మేరకు వాళ్లంతా నిరసనలు వ్యక్తం చేస్తూ ఉన్నారు.

నిన్నటి వేళ కూడా ఇదే విధంగా నిరసనలు వ్యక్తం చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఎటపాక గుండాల పురుషోత్త పట్నం కన్నాయిగూడెం పిచ్చుకలపాడు ప్రజలు నిన్నటి వేళ రోడ్డెక్కారు. విభజన పర్వం అనంతరం ఆంధ్రప్రదేశ్ లో విలీనం చేసిన తమ గ్రామాలను తెలంగాణలో కలపాలని విన్నవిస్తున్నారు. ఈ మేరకు కన్నాయిగూడెం ప్రధాన రహదారిపై ధర్నా చేపట్టారు.

ఇప్పటికే జిల్లాల విభజనే ఓ తలనొప్పిలా ఉంది. ఇక్కడి ప్రాంతాన్ని మన్యం జిల్లాగా అల్లూరి సీతారామరాజు పేరిట ఏర్పాటు చేశారు. ఆ ఏర్పాటుపై కూడా ఇంకా స్పష్టత లేదు. కనీస వసతుల కల్పనకు నిధులే లేవు.

తాజాగా గొడవల నేపథ్యంలో రంపచోడవరం నియోజకవర్గ పరిధిలో ఉండే ఈ గ్రామాలు అన్నీ కూడా తెలంగాణలో విలీనం అయితే మరో కొత్త వివాదం పరిహారం విషయమై రేగవచ్చు. పునరావాసం విషయమై రేగవచ్చు. ఇప్పటికే పోలవరం అడ్డుకోవాలన్న తలంపుతోనే తెలంగాణ ఉందని పేర్నినాని లాంటి మాజీ మంత్రులు వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్నారు.

ఇప్పుడు తాజాగా నెలకొన్న పరిణామాల నేపథ్యంలో ఐదూళ్ల తగువు పార్లమెంట్ వరకూ వెళ్లనుంది. ప్రస్తుతం పార్లమెంట్ ప్రాంగణంలో కొన్ని విషయాలపై ముఖ్యంగా జీఎస్టీపై పోరాటం చేస్తున్న ఎంపీ పసునూరి రవీందర్ బృందం రేపటి వేళ భద్రాచలం ముంపు విషయాన్ని అదేవిధంగా ఐదూళ్ల విలీనాన్ని తెరపైకి తీసుకు వచ్చే అవకాశాలే పుష్కలంగా ఉన్నాయి. అదే కనుక జరిగితే మరో విభజన తగాదా షురూ అయ్యే వీలుంది.

# రైల్వే సిగ్నల్స్ కూడా కరిగిపోతున్నాయి



యూరప్ లోని పలు దేశాల్లో కార్చిచ్చు చెలరేగింది. పోర్చుగల్, స్పెయిన్, ఫ్రాన్స్, గ్రీస్, క్రొయేషియా అంతటా చెలరేగిన కార్చిచ్చుల కారణంగా తీవ్రమైన వేడిగాలులతో ఉష్ణోగ్రత భారీగా పెరిగింది. యూకేలో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సియస్ వరకు పెరిగాయి. ఫలితంగా పలు రైలు సిగ్నల్స్ దెబ్బతింటున్నాయి. వేడితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

యూకే నేషనల్ రైల్వేస్ అధికారిక ట్విట్టర్ కొన్ని పోస్టులు పోస్ట్ చేశారు. వేడితో రైలు సిగ్నలింగ్ పరికరాల కాలిపోయిన ఫోటోలను ట్విట్టర్ లో పోస్ట్ చేశారు. "ఈ రోజు ఈస్ట్ కోస్ట్ మెయిన్ లైన్లో ప్రయాణించే ముందు మీ ప్రయాణాలను తనిఖీ చేయమని కూడా మేము మిమ్మల్ని అడుగుతున్నాము ఎందుకంటే మేము తీవ్ర అంతరాయాన్ని ఆశిస్తున్నాము. పీటర్బరో, లండన్ కింగ్స్ క్రాస్ మధ్య మార్గంలో అగ్ని ప్రమాదం జరిగిన తర్వాత మేము లైన్ను రిపేర్ చేస్తున్నాము" అని పోస్ట్ లో పేర్కొన్నారు.

జార్జ్ ఫోరాక్రెస్ అనే ట్విటర్ యూజర్ షేర్ చేసిన మరో పోస్ట్లో మండుతున్న వేడి కారణంగా భవనం లోపల ఫైర్ స్ప్రింక్లర్లు యాక్టివేట్ అవుతున్నట్లు చూపించారు. దేశంలో తొలిసారిగా ఉష్ణోగ్రత 40 డిగ్రీల సెల్సియస్కు చేరుకోవచ్చని వాతావరణ శాఖ అంచనా వేయడంతో, రెండు రోజుల పాటు జాతీయ అత్యవసర పరిస్థితిని ప్రకటించారు.

## ఎటు చూసినా ధరల మోతే.. రూపాయి క్షీణతతో మోయలేని భారం



ద్రవ్యోల్బణంతో నిత్యావసరాల ధరలు పెరిగిపోతున్నాయి. పెరుగు, మజ్జిగ, టెట్రా ప్యాక్ లలో పానీయాలు, 25 కిలోల వరకు పరిమాణంలో ఉండే ప్యాకేజ్డ్ ఆహార ఉత్పత్తులు, పిండులపై 5 శాతం జీఎస్టీ అమల్లోకి వచ్చింది. మరోవైపు డాలర్ తో రూపాయి 80కు పడిపోయింది. దీంతో దిగుమతి చేసుకునే వాటి ధరలు పెరిగి సామాన్యుల నుంచి సంపన్నుల వరకు ధరల కాక చూడాల్సిన పరిస్థితి నెలకొంది.

ద్రవ్యోల్బణం, డాలర్ తో రూపాయి మారకం విలువ క్షీణత ఈ రెండూ అంతర్జాతీయ అనిశ్చితుల ప్రభావం. కానీ, నిత్యావసరాలపై 5 శాతం జీఎస్టీ బాదుడు అన్ని రాష్ట్రాలు కలసి జీఎస్టీ కౌన్సిల్ లో తీసుకున్న ఉమ్మడి నిర్ణయం. తిలా పాపం తలా పిడికెడ్ అన్న తీరులో కారణాలైవేనా కానీ, ఇప్పుడు నలిగిపోతున్నది సామాన్య, మధ్యతరగతి ప్రజలే.

**విదేశీ చదువులు భారం** : డాలర్ తో రూపాయి 80కు పడిపోవడం వల్ల విదేశీ చదువులు భారంగా మారాయి. భారత్ నుంచి ఏటా 20 లక్షల మంది ఉన్నత చదువుల కోసం విదేశాలకు ప్రయాణమవుతుంటారు. ఇప్పుడు వీరంతా అధికంగా ఖర్చు చేయాల్సిన పరిస్థితి. ఎందుకంటే వారు జీవనం కోసం ఖర్చు చేసేది, ఫీజులు చెల్లించేది డాలర్లలో. ఆ డాలర్లను రూపాయిలతోనే మారకం చేసుకోవాల్సి ఉంటుంది. ఆరు నెలల క్రితం డాలర్ తో రూపాయి రూ.74 వద్ద ఉంది. ఇప్పుడు రూ.80కు తగ్గింది. డాలర్ తో రూపాయి తగ్గింది 9 శాతమే కనుక.. ఫీజుల భారం కూడా 9 శాతమే పెరిగి ఉంటుందని పొరపడొద్దు. విదేశాల్లోనూ ద్రవ్యోల్బణం కాక ఉందని మర్చిపోవద్దు. కనుక భారం ఎంత లేదన్నా 30-50 శాతం వరకు ఉంటుందని అంచనా.

**విద్యా రుణాలు** : విదేశీ విద్య కోసం రుణం తీసుకుని వెళ్లిన వారి పరిస్థితి కూడా ఇంతే. ఒకవైపు పెరుగుతున్న రుణ రేట్ల భారాన్ని, మరోవైపు రూపాయి పతన ప్రభావాన్ని మోయాల్సిందే. ఒక విద్యార్థికి చదువుల ఫీజులు, జీవన వ్యయాలు, రుణ రేట్లు అన్నీ కలసి తడిసి మోపెడు కానున్నాయి.

**విదేశీ ప్రయాణాలు** : విదేశీ ప్రయాణాల చార్జీలు కూడా భారీగా పెరిగిపోయాయి. గతేడాది అమెరికాకు ఒకవైపు ఎయిర్ లైన్ చార్జీ రూ.50వేల వరకు ఉంటే అది ఇప్పుడు రూ.లక్ష అయింది.

**రుణాలు భారం** : నేడు అడగకపోయినా బాబ్బాబు అంటూ రుణాలు ఇచ్చే సంస్థలు బోలెడు వచ్చేశాయి. దీంతో వ్యక్తిగత రుణాలు, క్రెడిట్ కార్డు రుణాల వినియోగం భారీగా పెరిగిపోయింది. ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేయడానికి ఆర్బీఐ వడ్డీ రేట్లను మే, జూన్ లో 0.90 శాతం మేర పెంచింది. దీంతో రుణ రేట్లు కూడా ఇంతే మేర పెరిగాయి. ఫలితంగా గృహ రుణాలు తీసుకున్న వారు కూడా ప్రతి నెలా అదనంగా చెల్లించాల్సి పరిస్థితి ఏర్పడింది.

**ప్రయాణాలు భారం** : మనం వినియోగించే పెట్రోల్, డీజిల్, విమాన ఇంధనం ఏటీఎఫ్ వీటన్నింటికీ మూలమైన ముడి చమురును 85 శాతం దిగుమతి చేసుకోవాల్సిందే. వీటి కోసం ఇప్పుడు ఎక్కువ రూపాయిలు చెల్లించుకోవాలి. దీంతో పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెరుగుతూనే ఉన్నాయి. వీటి రూపేణా ప్రతి నెలా అదనంగా ఖర్చు చేయక తప్పదు. డీజిల్ తో నడిచే బస్సు ప్రయాణాల చార్జీలు కూడా గత ఆరు నెలల్లో ఏ స్థాయిలో పెరిగాయో ప్రత్యక్షంగా చూస్తూనే ఉన్నాం. పెరిగిపోయిన ఏటీఎఫ్ చార్జీలతో విమాన టికెట్ల చార్జీలకు కూడా రెక్కలు వచ్చాయి.

**నిత్యావసరాలు** : బయటకు వెళ్లి టిఫిన్ చేద్దామన్నా, భోజనం చేయాలన్నా, బిర్యానీ తినాలన్నా జేబు నుంచి అధికంగా చెల్లించక తప్పదు. ఎందుకంటే పెరిగిన గ్యాస్ ధరలు హోటళ్లు, రెస్టారెంట్లపై పడుతుంది. దీనికితోడు ఇటీవలే 25 కిలోల వరకు పరిమాణంలో విక్రయించే ప్యాకేజ్డ్ పిండులు (శనగపిండి, గోధుమ పండి, మైదా పిండి), రవ్వలు, గోధుమలు, బియ్యం ఇలా అన్నింటిపైనా కొత్తగా 5 శాతం జీఎస్టీ పడింది. టిఫిన్ బండ్లు ఎక్కువగా 25 కిలోల లోపే వినియోగిస్తుంటారు. వీరు పెరిగిన ధరల భారాన్ని వినియోగదారులపై బాదక తప్పదు. అంతేకాదు, సామాన్యులు కూడా నిత్యాసరాలను తక్కువ పరిమాణంలోనే కొనుగోలు చేస్తుంటారు. ఆ రూపంలోనూ ఇది భారం కానుంది.

# పేదవాడి సొంతింటి కల నెరవేర్చిన జగనన్న



**కలెక్టరేట్, (విశాఖ సమాచారమ్)**: ప్రతి పేదవాడికి సొంతింటి కల నెరవేర్చిన ముఖ్యమంత్రి మన జగనన్న అని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. గురువారం ఆమె నాలుగోవ జోన్ 28 వార్డులో రామనగర్ ప్రాంతంలో ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త అక్రమాని విజయ నిర్మల, వార్డు కార్పొరేటర్ పల్లా అప్పలకొండతో కలిసి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ ఆనాడు జగనన్న పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు గూడు లేని నిరుపేదలకు సొంతింటి కల నెరవేరాలనే ఆశయంతో ఇల్లు లేని ప్రతి పేదవానికి ఇళ్ల పట్టాలను కేటాయించారని తెలిపారు. పేదవారికి ఇల్లు పట్టాలు పంపిణీ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులుగా మా అందరినీ భాగస్వాములుగా చేసి ఈ పంపిణీ కార్యక్రమం మా చేతుల మీదుగా చేయడం ఎంతో సంతోషం అని తెలిపారు. ఏ పేదవాడు ఊహించని విధంగా రాష్ట్రం మొత్తం మీద పెద్ద ఎత్తున ఇళ్ళ పట్టాల పంపిణీ కార్యక్రమం చేయడం ఎంతో సంతోషదాయకం అని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై ఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రజల అవసరాలను తెలుసుకొని ఆ దిశగా పరిపాలన సాగిస్తున్నారని, ఇటువంటి ముఖ్యమంత్రి మన జీవిత కాలం ముఖ్యమంత్రిగా ఉండేలా చూడాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇంచార్జ్ పల్లా దుర్గారావు, వైఎస్ఆర్ సిపి నాయకులు, వార్డు వెల్ఫేర్ సెక్రటరీలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## సమాచారమ్ వార్తకు స్పందన

**ఆరిలోవ, (విశాఖ సమాచారమ్)**: గత రెండు రోజుల క్రితం విశాఖ సమాచారమ్ దినపత్రికలో రాసిన వార్తకు విద్యాశాఖ అధికారులు స్పందించారు. 13 వ వార్డులో గల కృష్ణాపురం వద్ద ఉన్న ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు విద్యార్థులు తల్లిదండ్రులు వద్ద డబ్బులు వసూలు చేస్తున్నారంటూ రాసిన వార్తకు విద్యాశాఖ అధికారి ఎల్.చంద్రకళ స్పందించి సంబంధిత అధికారులను పంపించి విద్యార్థుల తల్లిదండ్రులను పిలిపించి డబ్బులు వసూలు పై ఏం జరిగిందని తెలుసుకున్నారు . తల్లిదండ్రులు అధికారులకు డబ్బులు వసూలు చేస్తున్నారని చెప్పడంతో ఆయనపై దర్యాప్తు చేస్తామని చెప్పారు . రాసిన వార్తకు అధికారులు స్పందించడంతో విశాఖ సమాచారమ్ దినపత్రికకు ధన్యవాదాలు తెలిపారు.

# పివిజి కుమార్ ఎదుట బహిరంగంగానే గొడవలకు దిగిన నేతలు

**చీడికాడ, (విశాఖ సమాచారమ్)**: మాడుగుల నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పివిజి కుమార్ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని స్థానిక వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయంలో టిడిపి మండల స్థాయి నేతలతో మండల సమావేశం ఏర్పాటు చేశారు ఈ సమావేశం ముఖ్య ఉద్దేశం గా రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు నియోజకవర్గ క్లస్టర్ ఏర్పాటు చేయాలని అందుకుగాను చీడికాడ మండలం నుండి క్లస్టర్ కు ఇద్దరు ప్రతినిధులుగా మాజీ మండల పార్టీ అధ్యక్షుడు పేరపు కొండబాబు తురువోలు మాజీ సర్పంచ్ రెడ్డి సన్యాసినాయుడు పేర్లను నియోజకవర్గ ఇన్చార్జి పి వి జి కుమార్ ప్రతిపాదించగా మండల స్థాయి నేతలు తీవ్రంగా వ్యతిరేకించారు మండల సమావేశం పెట్టకుండా తీర్మానం చేయకుండా ఏ విధంగా క్లస్టర్ పేర్లను ఎంపిక చేస్తారని పివిజి కుమార్ ను చిడికాడ మండలాధ్యక్షుడు పోతల చిన్ననాయుడుతోపాటు మండల



నాయకులు నిలదీశారు క్లస్టర్ వ్యక్తుల పేర్లను మార్చవలసిందిగా మిగిలిన నేతలు పట్టు పట్టడంతో పి వి జి కుమార్, రామానాయుడు వర్గాలకు చెందిన నేతల మధ్య పరస్పరం గొడవలు చెలరేగాయి అయితే స్పందించిన పి వి జి కుమార్ మీరే క్లస్టర్ వ్యక్తులను నిర్ణయిస్తే రాష్ట్ర పార్టీ కమిటీతో సంప్రదించి ఆమోదం తెలుపుతామని అన్నారు అనంతరం మండల పార్టీ నేతలందరూ చర్చించుకుని క్లస్టర్ ప్రతినిధులుగా జాజిమొగ్గల గణపతి, పైలా ముత్యాలనాయుడు, పేర్లను ఎంపిక చేశారు పేర్లను పరిశీలించిన పివిజి కుమార్ రాష్ట్ర పార్టీ హైకమాండకు తెలిపి ఇద్దరైతే ఇద్దరు లేదా నలుగురు పేర్లను ఎంపిక చేస్తామని నలుగురిలో మీరు సూచించిన ఇద్దరు పేర్లు కచ్చితంగా ఉంటాయని చెప్పడంతో ఒకసారిగా గందరగోళం చెలరేగింది ఇద్దరు పేర్లు చెప్తే నలుగురిని ఎలా సూచిస్తావని నాయకులు కార్యకర్తలు సైతం పివిజి కుమార్ పై తిరుగుబాటు చేసి సమావేశం నుండి వెళ్లిపోయారు ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం నాయకులు పోతల చిన్నం నాయుడు, పేరపు కొండబాబు, దారపు పెద్ది నాయుడు, బొబ్బాది తాతారావు, జాజిమొగ్గల గణపతి, జాజిమొగ్గల వెంకటరమణ, పట్నాల నానాజీ, పైలా ముత్యాల నాయుడు, పంచాడ దాలి నాయుడు, సింగపల్లి అప్పారావు, పాతాళం చిన్ననాయుడు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# అతి తక్కువ గల శిశువుకు ప్రాణం పోసిన రెయిన్ బో హాస్పిటల్



**ఆరిలోవ, (విశాఖ సమాచారమ్)**: ఆరిలోవ హెల్త్ సిటీ లోగల రెయిన్ బో చిల్డ్రన్ హాస్పిటల్ లో డాక్టర్ల బృందం 26 వారాలకే కేవలం 430 గ్రాముల బరువుతో జన్మించిన అర్జున్ వర్మ కు ప్రాణం పోశారు. ఆరోగ్య పరంగా అనేక సవాళ్లు ఎదురైనా, 85 రోజుల పాటు నిరంతరాయంగా అందించిన చికిత్స తరువాత హాస్పిటల్ నుంచి అతనిని డిశ్చార్జ్ చేశారు. హాస్పిటల్లో అత్యంత వేడుకగా నిర్వహించిన ఎన్ఐసీయు గ్రాడ్యుయేషన్ వేడుకలో అర్జున్ వర్మతో పాటుగా అదే నెలలో, నెలలు నిండకుండానే జన్మించిన మరో నలుగురు శిశువులను సైతం డిశ్చార్జ్ చేశారు.

రెయిన్బో చిల్డ్రన్స్ హాస్పిటల్, వైజాగ్ లోని సీనియర్ ప్రసూతి వైద్యులు డాక్టర్. సీహెచ్ రాగసుధను మార్చి 29న హనీషా కేవలం ఐదున్నర నెలల గర్భవతిని అయినప్పటికీ నీరు బయటకు వస్తుందంటూ కలిశారు. ఆమెకు అత్యవసరంగా చేసిన అల్ట్రాసౌండ్ పరీక్షలో ఆమె గర్భంలో అసలు ఉమ్మినీరు లేదని తేలింది. అదృష్టవశాత్తు తల్లి నుంచి బిడ్డకు రక్త సరఫరాలో మాత్రం ఎలాంటి అంతరాయమూ కలుగలేదు. అంతేకాకుండా ఇన్ఫెక్షన్ తాలూకా లక్షణాలు కూడా ఏమీ కనిపించలేదు. తల్లిదండ్రులతో పాటుగా ఎన్ఐసీయు సిబ్బందితో చర్చించిన మీదట డాక్టర్ రాగసుధ, తక్షణమే డెలివరీ చేయకుండా కొన్నాళ్లపాటు గర్భం పొడిగించాలని నిర్ణయించారు. అదే సమయంలో తల్లి, బిడ్డల ఆరోగ్యం, భద్రతకు ఎలాంటి భంగం వాటిల్లకుడకుండా తగిన జాగ్రత్తలూ తీసుకున్నారు. తల్లి గర్భంలో శిశువు గడిపే ప్రతి రోజూ ఆ శిశువు జీవించేందుకు ఉన్న అవకాశాలు కూడా మెరుగవుతాయి. శిశువు ఊపిరితిత్తులు మరియు మెదడు ఎదిగేందుకు తగిన ఔషదాలను హనీషా కు అందించారు. దురదృష్టవశాత్తు, ఎనిమిది రోజుల తరువాత హనీషాకు శస్త్రచికిత్స చేసి ఏప్రిల్ 7వ తేదీన మగ శిశువును డెలివరీ చేశారు. ఈ డెలివరీ సమయంలో డాక్టర్ విశాల్ కోలీ నేతృత్వంలో డాక్టర్. రాగసుధతో పాటుగా ఎన్ఐసీయు డాక్టర్లు, నర్సులతో కూడిన బృందం పాల్గొంది.

డాక్టర్ .విశాల్ కోలీ, డాక్టర్ అన్వేష్ అమితి, డాక్టర్ శ్రీలత పులి అత్యంత అనుభవజ్ఞులైన డాక్టర్ శ్రీలత పులి మాట్లాడుతూ అర్జున్ శరీర బరువు ఒక కేజీ చేరడానికి 45 రోజులు పట్టింది. ఇప్పుడు అతని బరువు 1.7 కేజీలు. తనకు ఎదురైన కష్టాలతో 85 రోజుల పాటు సుదీర్ఘ పోరాటం చేసిన తరువాత అర్జున్ ఇప్పుడు సగర్వంగా ఇంటికి, జీవితంపై తాను సాధించిన గెలుపుతో వెళ్తున్నాడు. అతని అవయవాలన్నీ సాధారణ స్థితిలో, అంటే నెలలు నిండిన శిశువుకు తల్లి గర్భంలో ఏ విధంగా అయితే అవయవాలు వృద్ధి చెందుతాయో అదే రీతిలో అభివృద్ధి చెందాయని పరీక్షలు నిర్ధారించాయి. అతని ఎదుగుదలను క్రమం తప్పకుండా పరీక్షించాల్సిన అవసరం ఉంది'' అని అన్నారు. గత నెలలోనే, రెయిన్బో చిల్డ్రన్స్ హాస్పిటల్, వైజాగ్ అసాధారణంగా కేవలం 24×27 వారాల గర్భం కలిగినప్పటికీ జన్మించిన ఐదుగురు శిశువులను డిశ్చార్జ్ చేసారు. ఈ కార్యక్రమంలో రెయిన్బో చిల్డ్రన్స్ హాస్పిటల్ యూనిట్ హెడ్ అనిల్ కుమార్ , డాక్టర్ .శశ్వత్ మోహంతీ, డాక్టర్ యశ్వంత్ రెడ్డి, డాక్టర్ .ఎంఎస్వీ పల్లవి ,డాక్టర్. ఎంవీఆర్ శైలజ బీ డాక్టర్ నీహారిక అల్లు ఇతర హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు. .

# అందుబాటులో ఇ-అర్బన్ హెల్త్ సెంటర్




**పార్వతీపురం, మన్యం, (విశాఖ సమాచారమ్):** ఇ- అర్బన్ హెల్త్ సెంటర్ లు అందుబాటులోకి వచ్చాయని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డా.బి.జగన్నాధరావు అన్నారు. కురుపాం నియోజకవర్గ పరిధిలో గల మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లకు పార్వతీపురం లయన్స్ క్లబ్ లో ఓరియంటేషన్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ ఈ ఆరోగ్య కేంద్రం అందించే వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్య ఆరోగ్య కేంద్రం ద్వారా సమగ్ర మాతృ ఆరోగ్య సంరక్షణ సేవలు, సమగ్ర నవజాత శిశు ఆరోగ్య సంరక్షణ సేవలు, పిల్లలు, కౌమార దశ బాల బాలికల ఆరోగ్య సంరక్షణ సేవలు, సమగ్ర గర్భ నిరోధక, కుటుంబ నియంత్రణ సేవలు, పునరుత్పత్తి ఆరోగ్య సేవలు, అంటు వ్యాధుల నియంత్రణ, నివారణ మరియు ఆరోగ్య సేవలు, అసంక్రమిత వ్యాధులు - ఆరోగ్య పరీక్షలు, సమగ్ర ఆరోగ్య సేవలు, ప్రాధమిక కంటి ఆరోగ్య పరీక్షలు, చెవి, ముక్కు, గొంతు ప్రాధమిక ఆరోగ్య సేవలు, మానసిక ఆరోగ్య సమస్యలు - ప్రాధమిక ఆరోగ్య పరీక్షలు, సేవలు, సాధారణ దంత ఆరోగ్య సంరక్షణ సేవలు, వృద్ధులకు ప్రాధమిక ఆరోగ్య సేవలను అందుబాటులో ఉంటాయన్నారు. ప్రతీ ఒక్కరు ఈ సేవలను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. కోవిడ్ వ్యాప్తి కాకుండా ప్రతీ ఒక్కరూ తప్పని సరిగా మాస్క్ లు ధరించాలని, తరచూ చేతులు శుభ్రపరచుకోవాలని సూచించారు. వర్షా కాలం దృష్ట్యా అంటు వ్యాధులు ప్రబలకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా వైద్యశాఖాధికారి డా. దుర్గా కళ్యాణి, డిటిసిఓ డా.విజయ కుమార్, డిఐఓ డా. జగన్మోహన్, డెప్యూటీ డిఎంహెచ్ఓ డా. అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# జాబు రావాలంటే జగన్ పోవాలి!



**పార్వతీపురం, మన్యం, (విశాఖ సమాచారమ్):** రాష్ట్రంలో ఉన్నటువంటి నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు రావాలంటే జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం దిగిపోవాలని అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి బి టి నాయుడు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర సమితి పిలిపి మేరకు హలో యువత చలో యువత చేపట్టిన కార్యక్రమంలో ఆర్కే డిగ్రీకాలేజీ లో యువతను ఉద్దేశించి మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో ఎన్నికల ముందు జగన్మోహన్ రెడ్డి యువతకు ఇచ్చినటువంటి హామీని తొక్కారని ఆయన ఆరోపించారు. అలాగే రాష్ట్రంలో ఉన్నటువంటి రెండు లక్షల 35 ఉద్యోగాలు భర్తీ చేయాలని జాబ్ క్యాలెండర్ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏడాది పదివేల 124 పోస్టులు విడుదల చేయడం అనేది ఎంతవరకు సమంజసం అని ఆయన అన్నారు. ఏదైతే ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నెరవేర్చకపోతే గతంలో ప్రభుత్వాన్ని గతి ఈ ప్రభుత్వానికి కూడా అదే గతి పడుతుందని అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి బి టి నాయుడు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ కిరణ్ కుమార్. సిహెచ్ సత్యనారాయణ. తిరుపతిరావు రాజు, బాలు, ఉత్తంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వరద బాధితులకు వైద్య సేవల పట్ల ప్రత్యేక దృష్టి

**చింతూరు, (విశాఖ సమాచారమ్):** చింతూరు ఐటీడీఏ పరిధిలో నాలుగు మండలాలలో వరద బాధితులకు వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలని వరదల ప్రత్యేక అధికారి కార్తికేయ మిశ్రా, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ గార్ల ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్య శాఖ దృష్టి సారించింది. వరద బాధితుల పునరావాస కేంద్రాలలో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం చేసి తగు చికిత్సలు అందిస్తున్నారు. చింతూరు, కూనవరం, వీఆర్పురం మండలాల పరిది లో 110 ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వరద బాధితులకు ప్రత్యేక వైద్య సేవలు అందిస్తున్నారు. ప్రతి పునరావస కేంద్రంలో గల ప్రతి ఒక్కరికీ వైద్య పరీక్షలు చేసి సంబంధిత మందులు ఉచితంగా పంపిణీ చేస్తూ పలువురి ప్రశంసలు అందుకుంటున్నారు.




**ఈస్ట్ కోస్ట్ రైల్వే**

టెండరు నెం. SANDT_WAT_TKRI_BLMK

పని పేరు: వాల్తేరు డివిజన్‌లో K.R లైను నందు టికిరి-భాలుమస్కా మధ్య సెక్షన్‌లో 6 క్వాడ్ కేబుల్ వేయుట.

ప్రకటిత విలువ: ₹ 3,51,01,217/-, బయానా: ₹ 3,25,500/-, పని పూర్తి చేయు కాలం: 12 నెలలు.

బిడ్డింగ్ ప్రారంభ తేది: 26.07.2022, టెండరు ముగింపు తేదీ మరియు సమయం: 09.08.2022న 1500 గంటలకు

ఈ టెండరునకు మాన్యువల్ ఆఫర్లు అనుమతించరు మరియు ఏదైనా అట్టి మాన్యువల్ ఆఫర్ అందినచో తిరస్కరిస్తారు.

పూర్తి వివరములు మరియు టెండరు డాక్యుమెంట్లు లభించు వెబ్‌సైట్: www.ireps.gov.in

సీనియర్ డివిజనల్ సిగ్నల్ & టెలికాం ఇంజనీరు, వాల్తేరు

PR-314/N/22-23

**ఈస్ట్ కోస్ట్ రైల్వే**

ఇ-టెండరు ప్రకటన నెం. ET-SRDCMO-CATG-CR-VSKP-2022, తేదీ. 14.07.2022

టెండరు పేరు: ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేరు డివిజన్ నందు విశాఖపట్నం స్టేషన్ వద్ద రైల్ కోచ్ రెస్టారెంట్ స్థాపించుట, ఆపరేషన్, మేనేజుమెంట్ అయిదు సంవత్సరాల కాలంపాటు నిర్వర్తించుట.

1 సంవత్సరమునకు టెండరు విలువ: ₹11,63,828/-, బయానా: ₹25,000/-, టెండరు కాలం: 5 సంవత్సరాలు, క్యాటగిరి: సంపాదన.

టెండరు తెరచు తేదీ మరియు సమయం: 08.08.2022న 1100 గంటలకు

ఈ టెండర్లు కొరకు మాన్యువల్ ఆఫర్లు అనుమతించరు మరియు ఏదైనా అట్టి మాన్యువల్ ఆఫర్ అందినచో తిరస్కరిస్తారు.

పూర్తి వివరములు మరియు టెండరు డాక్యుమెంట్లు లభించు వెబ్‌సైట్: www.ireps.gov.in

సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్-II, వాల్తేరు

PR-310/N/22-23


# కెఎఫ్‌సి సరికొత్త పాప్‌కార్న్ న్యాచోస్

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** కెఎఫ్‌సి యొక్క సిగ్నేచర్ రుచిభరితమైన చికెన్ పాప్‌కార్న్, లోపలి వైపున మెత్తగా ఉంటుంది కానీ నమ్మశక్యం కాకుండా బయటి వైపున కరకరలాడుతూ ఉంటుంది, కరకరలాడే న్యాచోస్, మరి కచ్చితంగా ఉండేలా సాస్ తో వడ్డించుకోండి! అతిపెద్దది, అత్యంత కరకరలాడే బ్లాక్ బస్టర్ డోరిటోస్ న్యాచోస్ యొక్క ప్రోత్సాహక రుచులు మరియు అల్లికలతో కలిసి కరకరలాడే చికెన్ పాప్‌కార్న్ తో పసందైన రుచిని తీసుకువస్తూ ఇది న్యాచోస్ తో నిస్సందేహంగా మీరు ఎప్పుడూ కలలో కూడా ఊహించని అత్యుత్తమ సమ్మేళనంగా ఉంది. రెండు నంజుకునే సాస్‌లు - మసాలా సాల్సా మరియు మీగడ జలాపెనోతో సమృద్ధమైన - పాప్‌కారన్ న్యాచోస్ మీ ఉపాహార సమయానికి మసాలా దట్టించడానికి సరిగ్గా సరైన నటనా పరిమాణం. కెఎఫ్‌సి అభిమానులకు ప్రత్యేకంగా-రూపొందించబడిన త్రికోణాకారపు బాక్సుల్లో అందించబడే ఈ సరికొత్త అందజేతకంటే కావాల్సింది ఇంకేం ఉంటుంది, కరకరలాడే పసందైన విందు కోసం ఈ న్యాచోనెస్ డయల్ చేయండి. అన్ని కెఎఫ్‌సి రెస్టారెంట్లలో లభిస్తుంది, కాబట్టి. సరికొత్త పాప్‌కార్న్ న్యాచోస్ మీ ఇతర కెఎఫ్‌సి అభిమాన రుచుల్ని గూగుల్ ప్లే మరియు యాప్ స్టోర్ లో అదేవిధంగా మా వెబ్‌సైట్ (https://online.kfc.co.in) ద్వారా లభించే సరికొత్తదైన సౌకర్యవంతమైన యాప్ పైన ఆర్డర్ చేయవచ్చు. మరి లైట్స్, కెమెరా, క్రంచీ యాక్షన్, మరి కెఎఫ్‌సి పీక్షిద్దాం!

# అమృత భూమి సినిమా పోస్టర్‌ను విడుదల చేసిన జనసేన పార్టీ నేతలు




**పార్వతీపురం మన్యం, (విశాఖ సమాచారమ్):** ప్రకృతి వ్యవసాయం ప్రధాన అంశంగా జట్టు ట్రస్ట్ నిర్మించిన పూర్తి నిడివి గల సినిమా లిఅమృత భూమిలి సినిమా వాల్ పోస్టర్ ను జనసేన పార్టీ నాయకులు గురువారం స్థానిక సౌందర్య సినిమా హాల్ వద్ద విడుదల చేశారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ జిల్లా నాయకులు రెడ్డి కరుణ, వంగల దాలి నాయుడు, మానేపల్లి ప్రవీణ్, వంగలపూడి నాని, సిరిపరపు గౌరీ శంకర్ తదితరులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ప్రకృతి వ్యవసాయం చేసి, మాన వ మనుగడను నాశనం చేస్తున్న రసాయన వ్యవసాయానికి దూరంగా ఉండాలని కోరారు. మానవ మనుగడకు ఆరోగ్యాన్ని ప్రసాదించే ప్రకృతి వ్యవసాయాన్ని తమ జనసేన పార్టీ వ్యవస్థాపకులు జనసేనాని లికొణిదల పవన్ కళ్యాణ్‌లి ప్రోత్సహిస్తున్నారన్నారు. తమ పార్టీ జనసైనికులకు, వీర మహిళలకు కూడా ప్రకృతి వ్యవసాయం చేయాలని ఆదేశించారన్నారు. అటువంటి జనసేనాని ఆశయాలకనుగుణంగా జట్టు ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ డి.పారినాయుడు నిర్మించిన లిఅమృత భూమిలి సినిమాను అందరూ చూసి, ఆరోగ్యాన్ని పాడు చేస్తూ ఆయుష్షును తగ్గిస్తున్న రసాయన వ్యవసాయాన్ని విడిచిపెట్టి ప్రకృతి వ్యవసాయం చేయాలన్నారు. రైతులు అందరూ ప్రకృతి వ్యవసాయం చేసి ఆయా పంటలను వారు తిని వారి ఆరోగ్యాలతో పాటు ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమృత భూమి సినిమాలో జనసేన పార్టీ నాయకులు వంగల దాన నాయుడు మాస్టారు నటించడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా అతనికి అభినందనలు తెలిపారు. ఇటువంటి సినిమాలు మరికొన్ని రావాలని, సమాజ శ్రేయస్సు కోరి, ధైర్యంతో ఇటువంటి సినిమాను నిర్మించి నందుకు జట్టు ట్రస్టును అభినందించారు.

# తూనికలు, కొలతల పరికరాలు ఎలా సరిచూడాలి ?

తూనికలు,కొలతల పరికరములు ఉపయోగించు ప్రతి వ్యక్తి / సంస్థ విధిగా వారి వారి పరికరములను నిర్ణీత సమయములో తూనికలు, కొలతల శాఖ వద్ద సమర్పించి సదరు పరికరములు నిర్ణీత ప్రమాణములకు అనుగుణంగా సరిచేయించుకొని ముద్రలు వేయించు కొనవలెను.తూనికలు, కొలతల పరికరములపై సరియిన ముద్రలు లేకుండా వినియోగించడం కలిగి ఉండడము చట్టారీత్యా నేరము.

**తనిఖీలు:** ఈ క్రింద పేర్కొనిన అంశాలకు సంబంధించి తూనికలులు కోలతల శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించేదరు.

తూనికలు,కొలతలు ప్రామాణీకమా?కాదా?

సకాలములో సరిచూచ బడినవా? లేదా?

సదరు పరికరముల ద్వారా ఖచ్చితమైన పరిమాణాలను ఇచ్చుచున్నారా?లేదా?

ప్యాకేజీ వస్తువులు.

ప్రామాణీక లీగల్ మెట్రాలజీ (ప్యాకేజ్డ్ కమోడిటీస్) రూల్స్, 2011 ప్రకారంగా ముందుగా ప్యాక్ చేయబడిన సరుకులు ఈ క్రింద తెలిపిన వివరములు ముద్రించునప్పుడు సదరు తయారీదారులు/అమ్మకం దారులపై తూనికలు కోలతల శాఖ వారిచే తగు చర్యలు చేపట్టబడును.

మీరు కొన్న లేక మీకు చేర్చిన సరుకు పేర్కొన్న దాని కంటే తక్కువ బరువు ఉన్నప్పుడు ప్యాకేజీ పైన సరుకు పేరు , దాని పరిమాణం, తయారు తేదీ,చిల్లర అమ్మకపు ధర వంటి ముఖ్యమైన సమాచారం పొందుపరచనప్పుడు.

ప్యాకేజీ పైకి నమ్మించేలా కనపడి,దానిపైన పేర్కొన్న దాని కన్నా తక్కువ పరిమాణంలో ఉన్నప్పుడు విలువైన నగలు, రత్నాలను ఉత్తమ ప్రామాణీక తూనికలను కాకుండా విక్రయించి నప్పుడు,ప్యాకేజీపై ముద్రించిన ధరను వ్యాపారస్తునికి అనుకూలంగా చెరపడం, మరకవేయడం లేదా మార్చడం చేసినప్పుడు ప్రామాణీక బరువు లేదా కొలతను వాడకుండా సరుకును అమ్మినప్పుడు. ఇనుము టి.ఎం.టి.బార్ల వంటి ఘనా పదార్థలను బరువుపైన కాకుండా సంఖ్యాపరంగా అమ్మినప్పుడు.

దిగుమతి అయిన సరుకుల ప్యాకేజీపై దిగుమతిదారుని పేరు, సరుకుల పరిమాణము మరియు చిల్లర అమ్మకపు ధర తయారైన నెల, సంవత్సరం వంటి వివరాలు లేనప్పుడు.

ప్యాకేజీలపై గరిష్ట చిల్లర ధరను మార్చగలిగే విధంగా వేర్వేరు స్టిక్కర్లు అతికించి ఉన్నప్పుడు

పెట్రోలు,డీజిల్ సరఫ్రా చేసే పెట్రోలు పంపు కొలత ప్రమాణం సరిచూసు కొనడానికి వీలుగా ఐదు లీటర్ల పరీక్షా కొలసాధనం సమకూర్చ లేనప్పుడు.

ఒక వస్తువు ప్రకటితమైన గరిష్ట రిటైలు ధర కన్నా ఎక్కువ ధరకు అమ్ముతున్నప్పుడు

ఫిర్యాదుల నిమిత్తం వినియోగదారులు సంప్రదించుట కొరకు ప్యాకేజీపై వినియోగ దారుల సంరక్షణ వివరములు ఫోను నంబరుతో సహా ముద్రించనప్పుడు.పైన తెలిపిన విధులతో బాటు,అందు బాటులో ఉన్న ఫిర్యాదుల పరిష్కార యంత్రాగాన్ని ఉపయోగించు కొనేలా వినియోగదారులకు సాధికారికతను సమకూర్చడం.

అలా కాకుండా అధిక ధరలకు అమ్మితే బాధిత వినియోగదారుడు తూనికల,కొలతల శాఖవారి టోల్‌ఫ్రీ నెంబర్ 1800-425-4202 కి ఫోన్ ద్వారా ఫిర్యాదు చేసి న్యాయాన్ని పొందొచ్చు.

# 75 రోజుల పాటు బూస్టర్ డోస్ వ్యాక్సినేషన్



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** ఆజాది కా అమృత్ మహొత్సవంలో భాగముగా ఈనెల 15 నుండి 75 రోజుల పాటు జరుగు కోవిడ్ వ్యాక్సినేషన్ బూస్టర్ డోసు కార్యక్రమము అనకాపల్లి జిల్లాలో అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రము లలో మరియు పట్టణ ఆరోగ్య కేంద్రముల ద్వారా 9.30 లక్షల బూస్టర్ డోసులు లక్ష్యముగా నిర్ణయించి ఉచితముగా వేయడం జరుగుతుంది. 18 సంవత్సరాల నుండి 59 సంవత్సరాల లోపు గల వారందరూ ఈ వ్యాక్సిన్ వేయించుకోవడానికి అర్హులు.రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ప్రతి సోమవారం మరియు శుక్రవారం దినములలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించడం జరుగుతుంది.

అర్హులు అందరూ మీ దగ్గరలో గల ఆరోగ్య కేంద్రము లలో ఉచితంగా బూస్టర్ డోస్ వేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి అనకాపల్లి డాక్టర్ హేమంత్ గారు ఒక ప్రకటన ద్వారా తెలియజేసినారు.

# అమేజాన్ ఫ్యాషన్ పై జులై 23-24న ఈ ప్రైమ్ డేలో ఆనందం

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ప్రైమ్ సభ్యులు కోసం అత్యంత ఇష్టమైన సంబరం దాదాపుగా సిద్ధంగా ఉంది, అమేజాన్ ఫ్యాషన్ పై అతి పెద్ద ఫ్యాషన్ మరియు బ్యూటీ బ్రాండ్స్ ఎంపిక పై అద్భుతమైన డీల్స్ మరియు ఉత్తేజభరితమైన ఆఫర్స్ తో ఈ ఏడాది జులై 23-24లలో భారతదేశంలో ప్రైమ్ డే మళ్లీ తిరిగి వచ్చింది.

రెండు రోజుల గొప్ప డీల్స్, ఆదాలు, కొత్త విడుదలలు మరియు ఇంకా ఎన్నో ఆరంభమయ్యాయి, ప్రైమ్ సభ్యులకు ఉచిత మరియు వేగవంతమైన డెలివరీకి అదనంగా ప్రముఖ ఫ్యాషన్ మరియు బ్యూటీ బ్రాండ్స్ నుండి విస్తృత శ్రేణి ఎంపికలలో ఉత్తేజభరితమైన డీల్స్ ను పొందడానికి అవకాశం ఇస్తోంది. దుస్తులు, ఫుట్ వేర్, మేకప్, వాచెస్, జ్యూవెలరీ, హ్యాండ్ బాగ్స్, లగేజ్, స్కిన్ కేర్, హెయిర్ కేర్, బాత్ & బ్యూటీ మరియు ఇంకా ఎన్నో వాటితో సహా ఫ్యాషన్ & బ్యూటీ ఉత్పత్తులు పై 50% నుండి 80% తగ్గింపు పొందడం ద్వారా ప్రైమ్ సభ్యులు ఆనందాన్ని కనుగొనవచ్చు.

భారతదేశంలో అత్యంత ప్రసిద్ధి చెందిన మరియు ప్రముఖ ఫ్యాషన్ మరియు బ్యూటీ బ్రాండ్స్ అలెన్ సొల్లి, వీరో మోడా, ప్యూమా, ఆడిడాస్, మామాఎర్త్, మేబిలైన్, ఫాస్ట్ ట్రాక్, ఫోసిల్, అమెరికన్ టూరిస్టర్, స్కై బ్యాగ్స్, జవేరి పెరల్స్, మెలోరా, చుంబక్, లవీ, లినో పెరోస్, లోరియల్ ప్రొఫెషనల్, బాత్ అండ్ బాడీ వర్క్స్ మరియ ఇంకా ఎన్నో అమేజాన్ ఫ్యాషన్ మరియు బ్యూటీ నుండి ఈ ప్రైమ్ డే నాడు 3 లక్షలకు పైగా స్టైల్స్ మరియు 70౦ కొత్త విడుదలలు నుండి షాపింగ్ చేయండి.

# అంతర్జాతీయ స్థాయికి బెల్లం ఎగుమతులు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** దేశంలో ప్రఖ్యాతి గాంచిన అనకాపల్లి బెల్లానికి ప్రపంచ స్థాయిలో గుర్తింపు వచ్చేందుకు అంతర్జాతీయ ఎగుమతులకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లో జరిగిన జిల్లా పారిశ్రామిక, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే మన బెల్లానికి దేశవ్యాప్తంగా మంచి గిరాకీ ఉందన్నారు. నాణ్యమైన బెల్లం నిల్వ ఉండే విధంగా శాస్త్రజ్ఞుల సలహాలననుసరించి తగిన చర్యలు చేపట్టినట్లయితే విదేశాలకు పెద్ద ఎత్తున ఎగుమతులు చేయవచ్చన్నారు. అంతర్జాతీయ స్థాయిలో తగిన ప్రాచుర్యం కల్పించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో ఎక్కువగా బెల్లం పండించే రైతులు ఉన్నారని వారికి గిట్టుబాటు ధర లభించేలా ఉత్పత్తులను ప్రోత్సహించాలన్నారు. జిల్లా పారిశ్రామిక ప్రాంతంలో విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు పరవాడలో విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు, పారిశ్రామిక ప్రాంతంలో నీటికి సంబంధించిన సమస్యల పరిష్కారం వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల అధికారి శ్రీధర్, జిల్లా వ్యవసాయ అధికారి లీలావతి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ హేమంత్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# యుద్ధ ప్రాతిపదికన సంక్షేమ పథకాలు



**పాడేరు, (విశాఖ సమాచారమ్):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమానికి రాష్ట్ర నలుదిక్కులా అపూర్వ స్పందన లభిస్తోంది. సంక్షేమ పథకాల అమలు తీరును తెలుసుకునేందుకు తమ నియోకవర్గ పరిధిలోని గడప గడపకు పర్యటిస్తున్న గిరిజన ముద్దు బిడ్డ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి గిరిజన ప్రజావాహిని ఘన స్వాగతం పలుకుతున్న ప్రజలు గురువారం పాడేరు నియోజకవర్గం, జి మాడుగుల మండలం,కే కొడాపల్లి సచివాలయంలో పరిధిలో వరుసగా రెండో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గున్నారు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి సచివాలయ పరిధికి చెందిన చింతలగొంది ,ఉర్లమెంట , గ్రామాల్లోని 310 గడపలనులి సందర్శించి, పారదర్శకమైన సంక్షేమ ప్రభుత్వ పాలనపై ప్రజాభిప్రాయాన్ని సేకరించారు ఆమె . అంతేకాక ప్రభుత్వ పథకాలను వారికి స్పష్టంగా వివరించి, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అతి త్వరలోనే వాటన్నింటినీ పరిష్కరిస్తామని హామీనిచ్చారు ఎమ్మెల్యే..

రాష్ట్రంలో యుద్ధ ప్రాతిపదికన సంక్షేమ పరిపాలనను కొనసాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కి ప్రజలంతా రుణపడి ఉంటామని వ్యక్తం చేస్తున్నట్టు అమె తెలిపారు! గత మూడున్నరేళ్ల లో ప్రజలకు ఇచ్చిన 95% హామీలను నెరవేర్చి, వారికి అండదండగా నిలబడుతున్న జననేత ప్రభుత్వానికి రాబోయే 2024 సార్వత్రిక ఎన్నికల్లో మరో సారి ప్రజలు ఆశీర్వదించటానికి సిద్ధంగా ఉన్నట్లు ప్రజలు వారి ఉద్దేశ్యాన్ని వెలిబుచ్చారు!

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి తో పాటు, ఎంపీటీసీ. లు జడ్పీటీసీ లు. కార్యకర్తలు పాల్గొన్నారు.

# జాతీయస్థాయి క్రీడల్లో యోగాకు అవకాశం



**చోడవరం, (విశాఖ సమాచారమ్):** భారతీయ ప్రాచీన యోగకు జాతి క్రీడల్లో 2022 సంవత్సరం సెప్టెంబర్ 27 నుండి అక్టోబర్ 10 వరకు గుజరాత్ లో జరగబోయే జాతీస్థాయి క్రీడలలో చోటు కల్పించి నట్లు భారతీయ ఒలింపిక్ సంఘం ప్రకటించిందని ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ యోగా అసోసియన్ జాయింట్ సెక్రెటరీ పుల్లేటి సతీష్ తెలిపారు

సతీష్ మాట్లాడుతూ యోగను క్రీడను నేర్చుకుంటున్న విద్యార్థులకు శారీరక మానసిక ఆరోగ్యంతో పాటు భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలు కూడా ఉంటాయని అలాగే స్పోర్ట్ అథారిటీ ఆంధ్రప్రదేశ్ వారు యోగను క్రీడల్లో చేర్చి ఈనెల 29 30 31 గుంటూరులో మొదటిసారిగా రాష్ట్రస్థాయి యోగాసనా పోటీలు ప్రారంభిస్తున్నారని మరింత సమాచారం కొరకు 9291 276 900 ఫోన్ నెంబర్ నంప్రదించవలనినదిగా కోరారు అలాగే యోగాను జాతీయ క్రీడల్లో చేర్చినందుకుగాను మన భారత ప్రధాని నరేంద్ర మోడీ గారికి ఆంధ్రప్రదేశ్ స్టేట్ యోగా అసోసియేషన్ తరపున ధన్య వాదాలు తెలియజేస్తున్నట్లు అనకాపల్లి జిల్లా యోగ అసోసియేషన్ అధ్యక్షులు పుల్లేటి సతీష్ తెలిపారు.

# తోటపల్లి నీరు విడుదల



**పార్వతీపురం మన్యం, (విశాఖ సమాచారమ్):** సర్దార్ గౌతు లచ్చన్న తోటపల్లి బ్యారేజ్ ప్రాజెక్టు నీటిని ఖరీఫ్ పంటకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్న దొర గురువారం విడుదల చేశారు. తోటపల్లి బ్యారేజ్ ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ, ఎడమ ప్రధాన కాలువల వద్ద జరిగిన కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ మజ్జి శ్రీనివాసరావు, శాసనమండలి సభ్యులు పాలవలస విక్రాంత్, శాసనసభ్యులు పాముల పుష్ప శ్రీ వాణి, విశ్వసరాయి కళావతి, జాయింట్ కలెక్టర్ ఓ.ఆనంద్ సమక్షంలో ఉపముఖ్యమంత్రి నీటిని విడుదల చేశారు. ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తున్నా లెక్కచేయక రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని నిరూపిస్తూ నీటిని విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఖరీఫ్ సీజన్ ను ముందుకు తీసుకురావడం, అందుకు అనుగుణంగా సమాయాత్తం చేస్తూ నీటిని విడుదల చేయడం జరిగింది. కుడి ప్రధాన కాలువ ద్వారా ప్రాజెక్టు క్రింద మొత్తం 1,31,221 ఎకరాల అయకట్టుకు నీరు అందనుంది. ప్రధాన ఎడమ కాల ద్వారా 64 వేల ఎకరాలకు నీరు అందనుంది. కుడి ప్రధాన కాలువ క్రింద పార్వతీపురం మన్యం జిల్లాలో సీతానగరం, బలిజిపేట మండలాలలో 27 గ్రామాలకు చెందిన 13,683 ఎకరాలకు సాగునీరు అందుతుండగా విజయనగరం జిల్లాలో 12 మండలాలలో 201 గ్రామాలకు చెందిన 78,564 ఎకరాలు, శ్రీకాకుళం జిల్లాలో మూడు మండలాలలో105 గ్రామాలకు చెందిన 38,974 ఎకరాలకు సాగునీరు అందుతుంది. వెరసి 333 గ్రామాలకు చెందిన 1,31,221 ఎకరాలకు ప్రధాన కుడి కాలువ ద్వారా సాగునీరు అందుతుంది. ప్రధాన ఎడమ కాలువ ద్వారా పార్వతీపురం మన్యం జిల్లాలో బలిజిపేట, గరుగుబిల్లి, జియ్యమ్మవలస మండలాల్లో 4191.99 ఎకరాలు, వీరఘట్టం, పాలకొండ మండలాల్లో 27,410 ఎకరాలు, విజయనగరం జిల్లా వంగర మండలంలో 4,298 ఎకరాలు, శ్రీకాకుళం జిల్లా బూర్జ మండలంలో 1,345 ఎకరాలు, ఓపెన్ హెడ్ ఛానల్ ద్వారా 24,456 ఎకరాలు వెరసి 64 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఈ సందర్భంగా రైతులు సాగు నీటిని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్న దొర పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఖరీఫ్ సీజన్ ను ముందుకు తీసుకురావడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. రెండవ, మూడవ పంటలు వేయుటకు అవకాశం ఉంటుందని, ప్రకృతి వైపరీత్యాలకు రైతులు గురికాకుండా ఉండగలరని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం సూచించిన విధంగా వ్యవసాయ యాజమాన్య పద్ధతులు పాటించాలని ఆయన కోరారు. రెండవ, మూడవ పంటలను ఆరుతడి పంటలు వేయాలని తద్వారా రైతుకు లాభదాయకంగా ఉంటుందని చెప్పారు. నీటిని అవసరం మేరకు ఉపయోగించడం వలన మంచి దిగుబడి వస్తుందని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో ఉత్తర కోస్తా జలవనరుల శాఖ చీఫ్ ఇంజనీర్ ఎస్.సుగుణాకర రావు, కార్యనిర్వాహక ఇంజనీర్లు జి.రామచంద్రరావు, పి.సుధాకర్ రావు, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్ శ్రీహరి, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీ నాయుడు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## రావాడ లో జల జీవన్ మిషన్



**పరవాడ, (విశాఖ సమాచారమ్):** పరవాడ మండలం రావాడ పంచాయతీ మోటూరువాని పాలెం గ్రామములో జల జీవన్ మిషన్ పథకం లో భాగంగా 14 లక్షల వ్యయం తో ఇంటి ఇంటి కి కుళాయి పనులు గ్రామ సర్పంచ్ మోటూరు సన్యాసి నాయుడు, వైస్ ఎంపీపీ బంధువు నాగేశ్వరరావు గురువారం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో కావలి అప్పల రాజు గారు, మోటూరు హరిబాబు గారు, జమ్ముల అశోక్, కావలి మాని బాబు, ద్వారపురెడ్డి లింగ రాజు, మోటూరు దుర్గ,గ్రామ వాలంటీర్ మోహన్, మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు

# పరిశోధనాలయాలు రైతుకు దేవాలయాలు



**విజయనగరం:** ప్రకృతి వైపరీత్యాలను తట్టుకొని రైతుకు మేలు చేసే లా వ్యవసాయ పరిశోధనలు జరగాలని , రైతుల భవిష్యత్తు ఈ పరిశోధనల ఫలితాల పైనే ఆధారపడి ఉంటుందని రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ యం.వి.ఎస్.నాగిరెడ్డి తెలిపారు. పరిశోధనాలయాలు రైతుకు దేవాలయాలని, శాస్త్రవేత్తలే దేవుళ్ళని పేర్కొన్నారు. భవిష్యత్తు లో మాన్ పవర్ కు డిమాండ్ పెరిగి వ్యవసాయ రంగం లో పనిచేసే వారి సంఖ్య తగ్గుతుందని, ఇలాంటి పరిస్థితుల్లో యాంత్రీకరణే ప్రధాన వనరు అవుతుందని, అందుకు తగ్గట్టుగా రైతును సన్నద్ధం చేయవలసి ఉంటుందని అన్నారు. జిల్లా కలెక్టర్ సమావేశ మందిరం లో వ్యవసాయ, అనుబంధ రంగాల భాగస్వామ్య పక్షాల ముఖా ముఖి చర్చా కార్యక్రమం వైస్ చైర్మన్ ఆధ్వర్యం లో గురువారం జరిగింది. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రకృతిని ఏ ఒక్కరూ నియంత్రించ లేరని, అయితే ఆ ప్రకృతి తెచ్చే నష్టాలను కొంతవరకు తీర్చవచ్చని భావించిన ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి దేశం లో ఎక్కడా లేని విధంగా ఉచిత పంటల బీమా ను అమలు చేసి కష్టకాలం లో రైతుకు అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. ఏ పంట నష్టాన్ని ఆ పంటలోనే అందిస్తూ తోడ్పటునందిస్తున్నారని తెలిపారు. అంతే కాకుండా గత ప్రభుత్వం మిగిల్చిన పాత బకాయిలను చెల్లిస్తూ కూడా రైతులకు 9 గంటల ఉచిత విద్యుత్తు ను అందిస్తుందన్నారు. సాధ్యం కాని మాటలు ముఖ్యమంత్రి చెప్పరని, మేనిఫెస్టో లో చెప్పిన అంశాలను 90 శాతం నెరవెర్చారని, నవరత్నాలలో మొదటిదైన రైతు భరోసా సంవత్సరానికి రెండు సార్లు అందజేసి పంట కాలం లో రైతుకు పెట్టుబడికి ఇబ్బంది లేకుండా చూస్తున్నారని తెలిపారు. వేట నిషేధం లో గత 7 సంవత్సరాలుగా 4 వేల రూపాయలను ఇచ్చేవారని, మత్స్యకార్ భరోసా క్రింద ఈ మొత్తాన్ని 10 వేలకు పెంచారని అన్నారు. వ్యవసాయ బడ్జెట్ 11 శాతం నుండి 12 శాతం వరకు ఉండేదని, ఈ రెండేళ్లలో ఇది 16 నుండి 17 శాతానికి పెరిగిందని, రాష్ట్రం లో వ్యవసాయమే ప్రయారిటీ సెక్టార్ గా భావించి అందుకు తగ్గట్టుగా నిధులు కేటాయించడం జరుగుతోందన్నారు. ఉద్యాన, పాడి, మత్స్య రంగాలు కూడా వ్యవసాయం తో పాటు సమానంగా అభివృద్ధి చెందుతున్నాయని, వాటికీ అవసరమగు మార్కెటింగ్ సౌకర్యాలను కూడా ప్రభుత్వం కల్పిస్తోందని తెలిపారు. జిల్లాలో రెండవ ప్రధాన పంటగా మొక్కజొన్న సాగు జరుగుతోందని, బోరేవేల్స్ క్రింద పండించే అవకాశాలను పరిశీలించాలని అన్నారు. వ్యవసాయం, అనుబంధ శాఖల కు చెందిన రైతులు , అధికారులు జిల్లాలోని సమస్యలను, సలహాలను, సూచనలను అందించారు. రైతు సమస్యలకు స్పందిస్తూ రాత పూర్వకంగా సంబంధిత శాసన సభ్యుల ద్వారా పంపాలని, కలెక్టర్ కు, ముఖ్యమంత్రి కార్యాలయనికి కాపీ వేస్తూ తనకు కూడా ప్రతిని పంపాలని . వైస్ చైర్మన్ సూచించారు . అన్ని శాఖల అధికారులు రైతు పట్ల మానవతా దృక్పథం తో ఉండాలని, అర్హులైన వారందరికి ప్రభుత్వ పథకాలను అందించడం లో చిత్త శుద్ధి తో పనిచేయాలని అన్నారు.

ఈ సమావేశం లో సంయుయ్క్త కలెక్టర్ మయూర్ అశోక్, శాసన మండలి సభ్యులు డా.సురేష్ బాబు , జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వెంకటేశ్వర రావు, డి.సి.ఎం.ఎస్. చైర్ పర్సన్ డా.అవనపు భావన, రాష్ట్ర వ్యవసాయ మిషన్ సభ్యులు రఘురాం తదితరులు వ్యవసాయం, ఎరువులు, విత్తనాలు తదితర పలు అంశాల పై మాట్లాడారు.

తొలుతజిల్లా వ్యవసాయాధికారి తారక రామా రావు పవర్ పాయింట్ ద్వారా జిల్లా వ్యవసాయ ప్రణాళికను, పంటలను, విత్తనాల , ఎరువుల సరఫరా , జిల్లాలో అందిస్తున్న పథకాల వివరాలను వివరించారు. జిల్లాలో గల సాయిల్ లో మైక్రో న్యుట్రీయాంట్స్ తక్కువగా ఉన్నాయని, జింక్ సరఫరా చేయాలనీ రైతులు కోరుతున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమం లో పలువురు రైతులు వారి అభిప్రాయాలను వ్యక్తం చేసారు. కొత్తవలస కు చెందిన కె. శ్రీనివాసరావు, మెరకముడిదం గొల్లల మునగం కు చెందిన లక్ష్మి పతి రాజు మాట్లాడుతూ జిల్లాలో ఆర్గానిక్ పండ్ల ఉత్పత్తులు ఎక్కువగా పండిస్తున్నారని, ముఖ్యంగా మామిడి కి సరైన ధర లభించడం లేదని, ఆర్.బి.కే ల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేయాలనీ కోరారు. స్ప్రయర్స్ వంటి యంత్ర పరికరాలను అందించాలని కోరారు. మామిడి పంట ను కోయడానికి లేబర్ సమస్య వస్తుందని, కోత కాలం లో ఉపాధి హామీ పథకానికి అనుసంధానం చేస్తే బాగుంటుందని అభిప్రాయం వ్యక్తం చేసారు. పూసపాటిరేగ మండల, వెంపడాం గ్రామానికి చెందిన వెంకట రమణ మాట్లాడుతూ సోనా మసూరి రకాన్ని ప్రభుత్వం కొనడం లేదని, కొబ్బరి పంటకు తెగుళ్ళు ఎక్కువ వస్తున్నాని, , మామిడి పూత ఎక్కువగా రాలిపోతున్నదని దీని పై శాస్త్రవేత్తలు పరిశోధనలు చేయాలనీ అదే విధంగా రైతు భరోసా పెంచాలని కోరారు. గజపతినగరం కు చెందిన సామంత పైడి రాజు డ్రోన్స్ మండలానికి మూడే ఇచ్చారని, వీటిని పెంచాలని కోరారు. సబల స్వచ్ఛంద సంస్థకు చెందిన సరస్వతి మాట్లాడుతూ చిరు ధాన్యాల ఉత్పత్తి , మార్కెటింగ్ పై ప్రభుత్వం దృష్టి పెట్టాలన్నారు. మిల్లెట్స్ మిషన్ ఏర్పాటు చేయాలనీ, మిల్లెట్ విత్తనాలను సబ్సిడీ పై సరఫరా చేయాలనీ కోరారు. దీక్ష మహిళా వెల్ఫేర్ సొసైటీ కి చెందిన శాంతి మాట్లాడుతూ ట్రక్ ద్వారా తమ ప్రొడక్ట్స్ ని అమ్ముతున్నామని, జిల్లా స్థాయి లో ఒకే చోట షాపింగ్ మాల్ వంటి పెద్ద వేదిక వద్ద విక్రయించడానికి ట్లు చేయాలనీ కోరారు. మత్స్య రైతు బర్రి చిన్నప్పన్న మాట్లాడుతూ చెరువులు అన్యాక్రాంతం అవుతున్నాయని, దానివలన నీటి నిల్వలు తగ్గిపోతున్నాయని, చెరువులను పరిరక్షించాలని కోరారు. కొత్తవలస మండలం దేవాడ కు చెందిన ఉషారాణి మాట్లాడుతూ మిల్లెట్స్ విత్తనాల పై కూడా సబ్సిడీ ఇవ్వాలని, పంట నష్ట పరిహారాన్ని అంద జేయాలని కోరారు.

ఈ సమావేశం లో ఆత్మా పి.డి.డా.. అశోక్ కుమార్, పశు సంవర్ధక శాఖ జే.డి డా...రమణ, ఏ.పి.ఎం.ఐ.పి .పి.డి లక్ష్మి నారాయణ, ఉద్యాన శాఖ ఏ.డి. జమదగ్ని, మత్స్య శాఖ డి డి నిర్మలా కుమారి, విద్యుత్, జలవనరుల, పౌర సరఫరాల శాఖల అధికారులు, , ఎల్.డి.ఎం తదితరులు శాఖాపరంగా వారు చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు.

Invitation
DESI GHAR
www.desigharshop.com
PRESENTING A WIDE RANGE OF
PRODUCTS IN HANDLOOM
Bed Sheets | Hand Gloves | Aprons
Bed Spreads | Table Cloths | Towels
Door Curtains | Door Mats | Place-Mats

VENUE AT
HOTEL Daspalla
Hospitality By Passion
SURYA BAGH, VIZAG
Date: 24-07-2022 to 14-08-2022
Time: 10.30 am to 9.00 pm
Welcome to this Export Quality Collection and
Experience the timeless beauty of handlooms

జనహిత మ్యాట్రిమోనీ
తెలుగు బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక
శ్రీ షిరిడీ సాయిబాబా దేవాలయం, సాయి ఐశ్వర్య రెసిడెన్సీ కోలనీ,
ఖాజాగూడ, హైదరాబాద్- 500089,
మార్గము : డాబాజంక్షన్ నుండి లాంకోహిల్స్ మార్గంలో మహాలక్ష్మి
కోర్టు యార్డు వద్ద ఎడమ వైపు మార్గము చివర దేవాలయం కలదు.

తేది : 24-7-2022,
సమయం : ఉదయం
గం. 10.00 ల నుండి
మధ్యాహ్నం గం. 2.00 వరకు.
భోజన సదుపాయము కలదు.
రిజిస్ట్రేషన్ మరియు వివరముల కొరకు :
9393949345, 8074541283
9030841841 (సాయి గణేష్ : హైదరాబాద్)

VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : S.Veerabhadra Rao , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press Door No. 9-3-16,Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345,
Hyderabad : Cell : 9030841841, Kakinada : Cell: 7013118088, Simhachalam : Cell: 96526 99699, Paravaada : Cell: 77804 33919, Aarilova : Cell: 97050 51389,
Cheedikaada : Cell: 97686 33999.